KANCHARLA
# మనసులో మాట
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. | సంచలన తెలుగు దిన పత్రిక
## కోస్తాంధ్ర
రాజమహేంద్రవరం | కాకినాడ | కోనసీమ
అమలాపురం | తణుకు | ఏలూరు | భీమవరం
గురువారం 4 జూన్ 2026 పేజీలు 16




## సర్ కార్యక్రమానికి యంత్రాంగాన్ని
# సిద్ధం చేయాలి

- ఓటర్లకు టోల్ ఫ్రీ నెంబరు 1950 ద్వారా సహాయం
- పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ప్రతిపాదనలు చేశాం
- తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ సాయిప్రసాద్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ బుధవారం అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమంపై సమీక్షించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ కీర్తి చేకూరి, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, ఇంచార్జి డీఆర్వో ఎస్ భాస్కర్ రెడ్డి, ఆర్డీవో కే ఆనంద్ రావు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తహశీల్దార్లు పాపారావు, బీ నాగరాజు నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ సాయిప్రసాద్ మాట్లాడుతూ జూన్ 5 నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిర్దేశించిన కాల పట్టిక ప్రకారం సమర్థవంతంగా అమలు ..మిగతా 2లో



## జిల్లాలో మురుగు నీటి శుద్ధి
# కర్మాగారాల ఏర్పాటు

- ఎస్. టి. పి ల కోసం స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి ఆదేశంబండి

**అమలాపురం (మనసులోమాట) జూన్ 03:**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా, పట్టణాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ..మిగతా 2లో

# డబుల్ ఇంజన్ సర్కార్ తో అభివృద్ధి



- ఆంధ్రులు జీవనాడి, రాష్ట్ర ప్రజలకు వరం అయిన పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాది జరిగే పుష్కరాలు నాటికి ముందే పూర్తిచేస్తాం
- రాష్ట్రం లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కొరత లేదు
- రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని వైసిపి పార్టీ అడ్డుకుంటుందని వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరు
- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

2

# రూ.52 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తాం

- వై-నగరాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం
- 10వ డివిజన్ అభివృద్ధికి రూ.11 కోట్లు ఖర్చు చేశాం
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- రూ.73 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

2



## తూర్పు గోదావరి జిల్లాలో
# పెద్దపులి!

- పులి దాడిలో 13 ఆవుదూడలు మృతి

3



# సర్ కార్యక్రమానికి యంత్రాంగాన్ని సిద్ధం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలతో సమన్వయం, బీఎల్ఓలు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, ఇంటింటి సర్వే, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ జూలై 5 నుంచి ప్రారంభమయ్యే ఎస్ఐఆర్ తదుపరి దశల అమలుకు అవసరమైన యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో సిద్ధం చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరును ఎన్నికల జాబితాలో చేర్చడం, ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, ఓటర్ల మ్యాపింగ్, క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు సోషల్ మీడియా వేదికలను వినియోగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ తూర్పు గోదావరి జిల్లాలో ఎన్నికల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం ఉన్న 1,581 పోలింగ్ స్టేషన్లకు అదనంగా 217 కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. తద్వారా జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 1,799 కు చేరనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో ఓటర్ల ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. 2026 జూలై 1ను అర్హత తేదీగా నిర్ణయించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ నెల 5 నుంచి 14 వరకూ శిక్షణా కార్యక్రమాలు, జూన్ 15 నుంచి జూలై 14 వరకు బీఎల్ఓల ఇంటింటి సర్వే, జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురణ జరగనున్నట్లు వివరించారు. అందుకు సంబంధించి నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గత నెల (మే) 25 నాటికి జిల్లాలోని 16,25,708 మంది ఓటర్లలో 10,88,561 మంది (66.96 శాతం) ఓటర్ల మ్యాపింగ్ పూర్తి కాగా, 5,37,147 మంది ఓటర్ల మ్యాపింగ్ ఇంకా మిగిలి ఉందన్నారు. అత్యధికంగా అనపర్తి నియోజకవర్గంలో 78.55 శాతం మ్యాపింగ్ పూర్తి కాగా, రాజమహేంద్రవరం రూరల్‌లో 50.44 శాతం, రాజమహేంద్రవరం సిటీలో 55.64 శాతం మ్యాపింగ్ నమోదైందన్నారు. జిల్లాలో 2,53,656 మంది ఓటర్ల వివరాల మ్యాపింగ్ చేయవలసి ఉందన్నారు. అదే విధంగా ఓటర్ల సహాయార్థం టోల్ ఫ్రీ నంబర్ 1950 ఇప్పటికే పని చేస్తుండగా, జిల్లాలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు.



## డబుల్ ఇంజన్ సర్కార్ తో అభివృద్ధి

**నూజివీడు(మనసులో మాట) జూన్ 03:**

నూజివీడు మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం రాష్ట్ర, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలుపై రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాలు మంత్రి పార్థసారథి మాట్లాడుతూ... సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ లో అభివృద్ధి, సంక్షేమం జోడుగుర్రాల్లా ముందుకు పరుగులు పెడుతోందని అన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కొరత లేదని స్పష్టం చేశారు. ఆంధ్రులు జీవనాడి, రాష్ట్ర ప్రజలకు వరం అయిన పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాది జరిగే పుష్కరాలు నాటికి ముందే పూర్తిచేస్తామని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని వైసిపి పార్టీ అడ్డుకుంటుందని వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర అభివృద్ధి వేగంగా ముందుకు సాగుతోందని, వైసిపి పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు చూస్తూ ఊరుకోరని అన్నారు. ప్రపంచదేశాలలోని పారిశ్రామిక వేత్తలు తమ పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనుకూలమని భావించి ముందుకు వస్తున్నారని అన్నారు. ఆర్థికవ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా కల్పిస్తామని తెలిపారు. 20 నుండి 24 లక్షలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ముందుకు సాగుతున్నామని, ఇప్పటికే 9.50 లక్షల ఉద్యోగాలు యువతకు కల్పించామని అన్నారు. రెండు ఏళ్లలో నూజివీడు నియోజకవర్గంలో రూ 386 కోట్లు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి రూ 14.50 కోట్లు వైద్యసాయం క్రింద నిరుపేదలకు అందజేశామని తెలిపారు. పాత్రికేయులు సమావేశంలో ఏపి అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మరియు నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కూలిన 'దండి మార్చ్' స్మారక విగ్రహం

- **రాజుకుంటున్న రాజకీయ వివాదాలు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

రాజమహేంద్రవరం నగరంలోని కంబాల చెరువు వద్దనున్న 'దండి మార్చ్' స్మారక విగ్రహాలలో ఒకటి అడ్డంగా వాలిపోయింది. ఈ 'దండి మార్చ్' ను గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎంపీ మార్గాని భరత్ రామ్ పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. కంబాల సెంటర్ కు ప్రత్యేక ఆకర్షణగా గుర్తింపు పొందింది. ఇటీవల ఒక ఎన్జీఓ సంస్థ ఆ విగ్రహాలకు రంగులు వేసింది. అయితే ఆ విగ్రహాలలో ఒక విగ్రహం అడ్డంగా వాలిపోవటాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. జనసేన పార్టీ రాజమహేంద్రవరం సిటీ ఇన్చార్జి అత్తి సత్యనారాయణ (అనుశ్రీ) హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వైసీపీ నేతలపైన, మాజీ ఎంపీ భరత్ పైన నిప్పులు చెరిగారు. ఈ విధ్వంసం వెనుక ప్రతిపక్ష వైసీపీ నేతల హస్తం ఉందనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు జరపాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు)ను కోరనున్నట్టు తెలిపారు. జనసేన నేత అనుశ్రీ మాజీ ఎంపీ భరత్ పై చేసిన సంచలన వ్యాఖ్యల పట్ల వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో సరికొత్త రాజకీయ దుమారానికి తెర తీసినట్లయింది. ఈ విషయంలో మాజీ ఎంపీ భరత్ ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

## జిల్లాలో మురుగు నీటి శుద్ధి కర్మాగారాల ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి)

మురుగునీటిని శాస్త్రీయంగా శుద్ధి చేసేందుకు ప్రతిపాదించిన మురుగునీటి శుద్ధి కర్మాగారాల (ఎస్టిపి) ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రామచంద్రపురం, అమలాపురం మున్సిపల్ కమిషనర్లు, ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ రెవెన్యూ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పెరుగుతున్న జల కాలుష్యాన్ని అధిగమించడానికి, కఠినమైన పర్యావరణ నిబంధనలను పాటించడానికి ఇళ్లు, వ్యాపారాలు, పరిశ్రమల నుండి వచ్చే మురుగు నీటిని సురక్షితం గా పునర్వినియోగించడానికి (ఎస్ టి పి) ల ఏర్పాటు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన నీటి నిర్వహణే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ఆమె పేర్కొన్నారు. రామచంద్రపురం, అమలాపురం మున్సిపాలిటీలు, ముమ్మిడివరం నగర పంచాయతీ ఈ మూడు స్థానిక సంస్థల పరిధిలో ఎస్ టిపి ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదించిన భూములను రెవెన్యూ మరియు టౌన్ ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా పరిశీలించి, అనువైన స్థలాలను గుర్తించి ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి భూసేకరణ ప్రక్రియలో ఏమైనా సాంకేతిక చట్టపరమైన సమస్యలు ఉంటే వాటిని తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని, సంబంధిత మున్సిపల్ కమిషనర్లును ఆదేశించారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్ విభాగాలు సమన్వయంతో పనిచేసి, ప్లాంట్ల నిర్మాణానికి అనువైన మరియు వివాదరహిత స్థలాలను గుర్తించాలని ఆమె స్పష్టం చేశారు ఈ సమావేశంలో అమలాపురం, రామచంద్రపురం, ముమ్మిడివరం కమిషనర్లు, నిర్మల్ కుమార్, రాజు, రవి వర్మ టౌన్ ప్లానింగ్ అధికారులు జిల్లా రెవెన్యూ సిబ్బంది సుబ్బరాజు తదితరులు పాల్గొన్నా రు.

## రూ.52 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తాం

**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

నగర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో నిర్లక్ష్యానికి గురైన 10వ డివిజన్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే రూ.11 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తెలిపారు. నగరంలోని 10వ డివిజన్ పరిధిలోని ఏపీఎస్ఈబీ ఫంక్షన్ హాల్ నుంచి వీఎల్ పురం జంక్షన్ వరకు రూ.73 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, తెలుగుదేశం పార్టీకి సంప్రదాయంగా మద్దతు ఇచ్చే ప్రాంతమనే కారణంతో గత పాలకులు అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం 10వ డివిజన్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేశామని చెప్పారు. ఇప్పటికే సుమారు రూ.4 కోట్ల విలువైన 25 అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ.2 కోట్ల పనులు ప్రారంభ దశలో ఉండగా, రూ.4 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. అదనంగా రూ.1 కోటి విలువైన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ రోజు ప్రారంభించిన సీసీ రోడ్డు నగరంలో అత్యంత రద్దీగా ఉండే, ప్రజలకు కీలకమైన కనెక్టివిటీ కల్పించే రహదారి అని అన్నారు. గతంలో నిధుల కొరత కారణంగా రోడ్డు పనులు కొంతవరకే పూర్తయ్యాయని, ఇప్పుడు మిగిలిన భాగాన్ని కూడా పూర్తి స్థాయిలో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏ పని ప్రారంభించినా పూర్తి చేసి చూపిస్తుందే తప్ప మధ్యలో వదిలిపెట్టదని స్పష్టం చేశారు.

ఈ ప్రాంతంలో ఉన్న లారీ స్టాండు స్థలాన్ని క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగిస్తూ మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. కేంద్ర ప్రభుత్వం "ఖేలో ఇండియా" పథకం కింద రెండో దశ పనులకు రూ.13 కోట్ల నిధులు మంజూరు చేసి, కాంట్రాక్టరుకు అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. మరో పది రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అదే విధంగా తొలి దశలో రూ.28 కోట్ల పనులు టెండరు దశలో ఉన్నాయని, రెండు నెలల్లో వాటి ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

మనసులో మాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

# తూర్పు గోదావరి జిల్లాలో పెద్దపులి!

- **పులి దాడిలో 13 ఆవుదూడలు మృతి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా దేవీపట్నం మండలం గంగంపాలెం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున పులి దాడిలో 13 దూడలు మృతి చెందాయి. ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ప్రధాన కార్యాలయం నుండి ముఖ్య వన్యప్రాణి సంరక్షకులు ఎన్ నాగేశ్వర రావు, రాజమండ్రి ముఖ్య అటవీ సంరక్షకురాలు డాక్టర్ జ్యోతి, రాంపచోడవరం డిఎఫ్ఓ ఎన్ రామచంద్ర రావు, రాజమండ్రి ఫ్లయింగ్ స్క్వాడ్ డిఎఫ్ఓ టీ శ్రీనివాస రావు, రాంపచోడవరం సబ్ డిఎఫ్ఓ టీ అనూష, అడ్డతీగల సబ్ డిఎఫ్ఓ జేవీ సుబ్బారెడ్డి, ఇందుకూరు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కొండల రావు, ఫోక్స్‌పేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస రావు, 6 ర్యాపిడ్ రెస్క్యూ టీమ్ (ఆర్ఆర్టీ) బృందాలు, 5 ప్రజా అవగాహనా బృందాలు, 4 ట్రాంక్విలైజింగ్ బృందాలు, 2 డ్రోన్ బృందాలు, 1 కేజ్ బృందం, 1 వన్యప్రాణి అంబులెన్స్ బృందం, ఫ్రంట్‌లైన్ సిబ్బందితో కూడిన 19 హనుమాన్ బృందాలు, మొత్తం సుమారు 100 మంది సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిన్న రాత్రి హనుమాన్ బృందాలు సమీపంలోని గ్రామస్తులకు పులి సంచారం గురించి తెలియజేశాయి. పశువుపై తరచూ పులి దాడి





చేస్తుండటంతో పాడి రైతులు, గిరిజనులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కాగా పశువులను కోల్పోయిన రైతులకు అటవీ శాఖ వెంటనే నష్టపరిహారం చెల్లిస్తుందని సీనియర్ అటవీ అధికారులు హామీ ఇచ్చారు. ప్రజల రాకపోకలను నియంత్రించడానికి, అటవీ శాఖ పోతవరందండంగి రహదారిని దిగ్బంధించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. హనుమాన్ బృందాలన్నీ అత్యంత అప్రమత్తంగా ఉండి, పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నాయి.





## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆర్థిక సహాయం

**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

స్థానిక 49వ డివిజన్ సింహాచలం నగర్‌లో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదానికి గురై నష్టపోయిన కుటుంబాన్ని పరామర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తమ భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అందుబాటులో ఉన్న సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ శాఖ అధికారులతో మాట్లాడి అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. అలాగే సామాజిక సేవా సంస్థల సహకారంతో కూడా బాధిత కుటుంబానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. పర్యటన సందర్భంగా సింహాచలం నగర్‌లోని డ్రైనేజీ సమస్యలను కూడా పరిశీలించారు. స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. డివిజన్ ఇంఛార్జి దుత్తరపు గంగాధర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.



## పాఠశాలల్లో వంట చేసే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలి

**రాజోలు జూన్ 3, మనసులోమాట:**

పాఠశాలల్లో వంట చేసే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి గుబ్బల నరసింహమూర్తి పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలంలో ప్రాథమిక, ఉన్నత ప్రభుత్వ పాఠశాలలలో పని చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక వంట కార్మికులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం మండల విద్యాశాఖాధికారి గుబ్బల నరసింహామూర్తి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ప్రజా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో వంట చేసే పరిసరాలు చాలా పరిశుభ్రంగా ఉండాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించాలని తెలిపారు. అనంతపురం రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన కెఆర్పి జ్యోతి మధ్యాహ్న భోజనం లో మెనూ లో ఆహార పదార్థాలను ఏ మోతాదులో తీసుకోవాలో ఒక్కొక్క ఐటమ్ ను ఏ విధంగా తయారు చేయాలో వంట కార్మికులకు వివరించారు. మండల రిసోర్స్ పర్సన్ గటిగంటి శ్రీనివాస్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ద్వారా అందించే మెనూ లో పోషక పదార్థాల గురించి వంట కార్మికులకు శిక్షణ ఇచ్చారు.



## పిఠాపురం కాంప్లెక్స్ లో ఆసుపత్రి వ్యర్థాల కలకలం..

**పిఠాపురం, (మనసులో మాట)జూన్ 3:**

పిఠాపురం పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులు అహర్నిశలు శ్రమిస్తుంటే, అందుకు విరుద్ధంగా పలు వ్యాపార సముదాయాలు, ప్రైవేట్ ఆసుపత్రులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయి. నిబంధనలకు వ్యతిరేకంగా వాణిజ్య వ్యర్థాలతో పాటు ప్రమాదకరమైన వైద్య వ్యర్థాలను సైతం బహిరంగ ప్రదేశాలలో పడవేస్తుండటం తీవ్ర సవాలుగా మారుతోంది. ముఖ్యంగా పిఠాపురం ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్ అవుట్ గేట్ మార్గంలో రహదారి పక్కనే ఆసుపత్రి వ్యర్థాలను పడవేసిన తీరు స్థానిక వైద్యశాలల యాజమాన్యాల నిర్లక్ష్య ధోరణిని ఎత్తిచూపుతోంది. ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సల అనంతరం వచ్చే కాటన్ వేస్ట్, రోగుల కాళ్లు, చేతులకు కట్టిన సిమెంట్ కట్టు ఆకృతులను రోడ్డుపైనే పడవేశారు. బస్టాండ్ కాంప్లెక్స్ చుట్టుపక్కల మూడు ప్రముఖ ఆర్థోపెడిక్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో ఏ ఆసుపత్రి యాజమాన్యం ఈ ప్రమాదకర బయోమెడికల్ వ్యర్థాలను ఇక్కడ పడవేసిందో తెలియరాలేదు. మున్సిపల్ అధికారులు పట్టణంలో విస్తృతంగా వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రచారం చేస్తున్నప్పటికీ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై తగిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పదేపదే జరుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి వివిధ వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, హోటళ్ల యాజమాన్యాలకు వ్యర్థాల నిర్వహణ ప్రక్రియపై కఠినమైన ఆంక్షలు జారీ చేయాలని, లేనిపక్షంలో పట్టణం మొత్తం దుర్గంధభరితంగా మారుతుందని ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్న ఈ వ్యవహారంపై అధికారులు తక్షణమే స్పందించి, సీసీ కెమెరాల ఆధారంగా బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## హోమియో వైద్యంతో విద్యార్థులు నయం

**తాడేపల్లిగూడెం (మనసులో మాట) జూన్ 3 :**

వ్యాధులను గుర్తించి చికిత్స అందిస్తే హోమియో వైద్యం నయం చేస్తుందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం తాడేపల్లిగూడెం 2వ వార్డు యర్రా నారాయణ స్వామి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ హోమియో వైద్యంపై మరిన్ని పరిశోధనలు జరగాలన్నారు. పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో మణికంఠ చిన్న వయస్సులోనే ఇటువంటి సామాజిక సేవ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. హోమియో వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురికి నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే, హోమియో వైద్యుడు ధనాల సాయిరాం వైద్య సహకారంతో పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా ఐశ్వర్యం.. సంచలన తెలుగు దిన పత్రిక



# క్రైస్తవ సంగీత సువార్త మహోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ళ...

**మండపేట (మనసులో మాట), జూన్ 3**

పట్టణంలో సూర్య కన్వెన్షన్ హాల్ గ్రౌండ్ లో బెతెస్త క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 3 రోజులు పాటు నిర్వహించిన క్రైస్తవ సంగీత సువార్త మహోత్సవాల్లో మూడవరోజు కార్యక్రమంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ యేసుక్రీస్తు ప్రేమ, త్యాగం ఆయన అందించిన రక్షణ సువార్తను పాటల రూపంలో అందరికీ అర్ధమయ్యేలా చెప్పటానికి ఈ సంగీత సువార్త మహోత్సవాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా హృదయాలకు ఓదార్పు లభించటమేకాక ఆత్మీయ ఆనందాన్ని ఇస్తాయని అన్నారు. ఈ మహోత్సవాల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరి ఆ దేవుని ఆశీర్వాదాలు ఉండాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం బిషప్ డాక్టర్ ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగుళ్ళ ను దుశ్శాలువాతో సత్కరించారు.

# సామర్లకోట జగనన్న కాలనీలో త్రాగునీటి తిప్పలు



**సామర్లకోట (మనసులో మాట) జూన్ 3 :**

సామర్లకోట జగనన్న కాలనీ(జి.రాగంపేట రోడ్డు కాలనీ)లో 15 రోజులుగా త్రాగునీటి ఇబ్బందులకు గురవుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కాలనీ వాటర్ ట్యాంకు యొక్క మోటారు కాలి పోవడంతో అధికారులు మోటార్లు ఏర్పాటు చేయలేదని, దీంతో త్రాగు నీటి కోసం తీవ్ర అగచాట్లకు గురవుతున్నట్లు బాధితులు తెలిపారు. త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక తెలుగు దేశం నాయకులకు వివరించడం జరిగిందన్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదేశాల మేరకు జగనన్న కాలనీ ప్రాంత ప్రజల కోసం ట్యాంకర్ ద్వారా మంచినీటి సరఫరా చేపట్టినట్లు బుధవారం గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ బదుగు శ్రీకాంత్ తెలిపారు. శ్రీకాంత్ సహకారంతో మంచినీళ్లు లభించినట్లు స్థానికులు తెలిపారు. పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో అరకొర పనులు నిర్వహించడంతో జగనన్న కాలనీలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని బదుగు శ్రీకాంత్ తెలిపారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సహకారంతో ఆయా పనులను నిర్వహిస్తున్నామని శ్రీకాంత్ వివరించారు.

# పౌష్టికాహారమే క్షయ వ్యాధి బాధితులకు బలమైన ఔషధం

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

క్షయ వ్యాధి నిర్మూలనలో మందులతో పాటు పౌష్టికాహారం కూడా కీలక పాత్ర పోషిస్తుందని, క్షయవ్యాధి బాధితుల ఆరోగ్య పునరుద్ధరణకు సమాజంలోని ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం సామ్రాజ్య సిల్వర్స్ సహకారంతో నిక్షయ్ మిత్రగా ముందుకు వచ్చి 10 మంది క్షయ వ్యాధి బాధితులను దత్తత తీసుకుని పౌష్టికాహార కిట్లను అందించడం అభినందనీయమన్నారు. తిలక్ రోడ్డులో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్య అతిథిగా పాల్గొని బాధితులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అయినప్పటికీ, రోగులు వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా చికిత్స పొందడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయవ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. సమాజంలోని స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు, దాతలు నిక్షయ్ మిత్రులుగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు చికిత్సతో పాటు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా వారి ఆరోగ్య పునరుద్ధరణ వేగవంతం అవుతుందన్నారు. దేశాన్ని క్షయవ్యాధి రహిత భారతంగా తీర్చిదిద్దే లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి, డీలాటో డాక్టర్ ఎన్ వసుంధర మాట్లాడుతూ నిక్షయ్ మిత్ర కార్యక్రమం ద్వారా క్షయవ్యాధి బాధితులకు అందుతున్న సహకారం వ్యాధి నిర్మూలనకు ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. మరిన్ని స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, దాతలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రవి, డీటీసీ ఎంఓ డాక్టర్ సాయి సౌమ్య, సూపర్వైజర్లు సీహెచ్ రవికుమార్, ఎం వీర్రాజు, కెవివి సత్యనారాయణ, ఎల్ సతీష్ బాబు, ఎం శివ, ఆశ వర్కర్లు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, నిక్షయ్ మిత్రలు తదితరులు పాల్గొన్నారు.





# క్రికెట్ ఆర్సీబీ ఫ్యాన్స్ కు షాక్...

- ఐపీఎల్ సంబరాలు.. మితిమీరిన యువత పై కేసులు
- సెంటర్ సీసీ కెమెరాలుతో గుర్తింపు.. వేలం వెర్రి చేష్టలు చేస్తే చర్యలు

**మండపేట (మనసులో మాట), జూన్ 3**

ఈ ఏడాది టాటా ఐపీఎల్ టి 20 లో ఫైనల్స్ లో రాయల్ ఛాలెంజర్ బెంగళూరు విజేత గా నిలిచింది. ఈ మ్యాచ్ గత నెల 31 న గుజరాత్ లోని అహ్మదాబాద్ లో జరిగింది. రాత్రి మ్యాచ్ గెలిచిన తరవాత మండపేట లో ఆర్ సి బి ఫ్యాన్స్ సందడి చేశారు. కలువ పువ్వు సెంటర్ లో బైక్ లు పై ముగ్గురేసి కూర్చొని రౌండ్ లు వేసారు. బాణాసంచా కాల్చారు. ఈ వేడుకల్లో యువత మితి మీరి విన్యాసాలు చేసింది.దీనిపై సామాజిక మాధ్యమాల్లో వీడియోలు తీసి పోస్టులు పెట్టారు. కాగా దీనిపై సామాజిక కార్యకర్తలు కొందరు ఈ చేష్టలకు పోలీసులు అడ్డు కట్ట వేయాలంటూ కథనాలు ఇచ్చారు. దీంతో టౌన్ సి ఐ డి. సురేష్ దీనిపై దృష్టి సారించారు. కలువ పువ్వు సెంటర్ వద్ద ఉన్న సీసీ కెమెరాలు లో నిక్షిప్తం అయిన దృశ్యాలు ఆధారంగా కొందరు ఆకతాయిలు ను గుర్తించారు. వీరికి పోలీస్ స్టైల్ లో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సి ఐ సురేష్ మాట్లాడుతూకొందరు యువకులు రోడ్డు మీదకు వచ్చి ద్విచక్ర వాహనాలకు సైరన్ లు తీసి , రోడ్డు మీద న్యూసెన్స్ చేశారన్నారు. రోడ్డు మీద వెళ్ళే ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తూ ట్రాఫిక్ కు అంతరాయం కలిగించినట్లు పేర్కొన్నారు .బాణా సంచ కలుస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే విధంగా ప్రవర్తించినట్లు తెలిపారు. ఇలా ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై మండపేట టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోద చేసినట్లు తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు. సిసి ఫుటేజ్ ల ఆధారంగా ఇప్పటివరకు కొంతమంది నీ గుర్తించినట్లు చెప్పారు.ప్రజలు వేడుకలను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. ప్రజాశాంతి, ట్రాఫిక్ నియమాలు భద్రతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండపేట టౌన్ ఇన్స్పెక్టర్ సురేష్ హెచ్చరించారు.



# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు

- ప్రజలను మోసం చేసిన పాలనకు నిదర్శనం
- తోట ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

**మండపేట (మనసులో మాట), జూన్ 3**

ఎన్నికల్లో అమలు గాని, హామీ లు ఇచ్చిన అధికారం లోకి వచ్చిన చంద్ర బాబు దగా పాలన కు రెండేళ్లు పూర్తి అయ్యాయని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ ఛైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండపేట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను మండపేట నియోజకవర్గ వైసీపీ ముఖ్య నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి పేరుతో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని గాలికొదిలేసి ప్రజల విశ్వాసానికి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందన్నారు. ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్ర ప్రజలు ఆశించిన అభివృద్ధి కనిపించలేదని,ధరల పెరుగుదల, నిరుద్యోగం, సంక్షేమ పథకాల కోతలు ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేశాయని నాయకులు పేర్కొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో అమలైన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేయడం వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పోస్టర్ ఆవిష్కరణను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, రాష్ట్ర వైసిపి కిసాన్ సెల్ కన్వీనర్ రెడ్డి రాధాకృష్ణ రాజబాబు,ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయానికి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అవార్డు

- **ఏపీసీఎన్ఎఫ్ కు "ఫుడ్ ప్లానెట్ ప్రైజ్–2026" రావడం గర్వకారణం**
- **జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ బీ తాతారావు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం (ఏపీసీఎన్ఎఫ్) ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ "ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026" పురస్కారాన్ని అందుకోవడం పట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) బీ తాతారావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమానికి మరోసారి ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణమన్నారు. స్వీడన్‌కు చెందిన కర్ట్ బర్గ్‌ఫోర్స్ ఫౌండేషన్ పర్యావరణ పరిరక్షణ, సుస్థిర ఆహార వ్యవస్థల అభివృద్ధి కోసం అందించే "ఫుడ్ ప్లానెట్ ప్రైజ్" ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక పర్యావరణ పురస్కారాలలో ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు. ఈ అవార్డు రాష్ట్రానికే కాకుండా దేశానికీ విశేష గౌరవాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్, రైతు సాధికార సంస్థ గౌరవ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు డాక్టర్ టీ విజయ్‌కుమార్‌లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించేందుకు వారు అందిస్తున్న నాయకత్వం, మార్గదర్శకత్వం ఫలితంగానే ఈ అంతర్జాతీయ గుర్తింపు సాధ్యమైందన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని విజయవంతంగా అమలు చేయడం కోసం జిల్లా కలెక్టర్ ప్రోత్సాహం అందించే క్రమంలో క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు.



జిల్లాలో సుస్థిర ప్రకృతి వ్యవసాయానికి ఆదర్శంగా నిలుస్తున్న మహిళా రైతులు, రైతు కుటుంబాలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, క్షేత్రస్థాయి సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతుల ఉత్పత్తి వ్యయాలు తగ్గడంతో పాటు ఆదాయం పెరుగుతుందని, భూమి సారవంతత, జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజల ఆరోగ్యం మెరుగుపడతాయన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు జిల్లాలో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయడానికి ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి లభించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని, ప్రకృతి వ్యవసాయ ఉద్యమాన్ని మరింత విస్తృత స్థాయికి తీసుకెళ్లేందుకు ఇది దోహదపడుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ బీ తాతారావు అన్నారు.



## ఊటలంక మున్సిపల్ పాఠశాలకు కంప్యూటర్.. ప్రింటర్ బహుకరణ

**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

ఊటలంక మున్సిపల్ ప్రైమరీ పాఠశాలకు రూ.66 వేలు విలువైన కంప్యూటర్, ప్రింటర్ ను ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు బుధవారం అందజేసింది. పాఠశాల ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు గౌతమ ఘాట్ రోడ్డు లోని వర్తకుల స్వచ్ఛంద సేవా సంస్థ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టు ఉచిత సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షుడు మద్దుల మురళీకృష్ణ, ఇయ్యపు మురళీధర్, ట్రస్టు గౌరవ కార్యదర్శి బాలనాగు బలేష్ గుప్తా, సహాయ కార్యదర్శి దేవత సుధాకర్, డైరెక్టర్లు లక్కోజు వీరభద్రరావు (లక్కోజి ), మండవిల్లి వెంకట్రాజు (రాజా) సభ్యులు శ్రీఘాకొల్లి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ వీ రాజగోపాల్, ఉపాధ్యాయులు టీ దుర్గారావులకు కంప్యూటర్ ప్రింటర్ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల తరఫున ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్టుకు కృతజ్ఞతలు తెలిపారు.

నిరంతరం నిర్వహించే సేవా కార్యక్రమంలో భాగంగా కంప్యూటర్ ప్రింటర్ అందజేసినట్లు ట్రస్టు గౌరవ కార్యదర్శి బాలనాగు భలేష్ గుప్తా తెలిపారు.

## యమునోత్రి పుష్కర యాత్రకు భారీగా భక్తులు

**పెదపూడి (మనసులో మాట) జూన్ 3:**

పెదపూడి మండలంతో సహా కాకినాడ జిల్లాకు చెందిన పలు ప్రాంతాల యాత్రికులు యమునోత్రి పుష్కర యాత్రకు తరలి వెళ్లారు. యమునా నదికి జూన్ 2 నుండి జూన్ 12 వరకు పుష్కరాలు జరగనున్నాయి. గురుగ్రహం కర్కాటక రాశిలో ప్రవేశించిన సమయంలో పుష్కరాలు ప్రారంభమవుతాయి. యమునా నదిలో పుష్కర ఘడియల్లో పవిత్ర స్నానం చేయుట వల్ల అశ్వమేధ యాగ ఫలితం లభిస్తుందని, పూర్వజన్మ పాపాలు పితృ దోషాలు తొలగిపోతాయని పండితులు వివరిస్తారు. డెహ్రాడూన్, హరిద్వార్ నుండి యమునా నది జన్మస్థానానికి గుర్రాలు, డోలీలు, నడక మార్గం ద్వారా చేరుకోవలసి ఉంది. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు యమునా నది పురస్కారాలకు ఏర్పాటు భారీగా చేసినప్పటికీ, యాత్రికుల రద్దీ అధికంగా ఉండడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని పెదపూడి కి చెందిన ఆధ్యాత్మికవేత్త కోరా వీర్రాజు చౌదరి తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో యమునోత్రి సముద్రమట్టానికి 3293 మీటర్ల ఎత్తులో ఉన్నట్లు తెలిపారు.

ఈ యాత్రలో జానకి చట్టి మీదుగా యమునోత్రికి చేరుకునే ఐదు కిలోమీటర్ల నడక మార్గం అత్యంత ప్రధానమని, ఇది ఒక పెద్ద సాహసమేనని వీర్రాజు చౌదరి తెలిపారు. యమునోత్రి పుష్కరాలు ఉత్తరాఖండ్, హర్యానా, ఉత్తరప్రదేశ్లో నిర్వహిస్తున్నప్పటికీ, ప్రధానంగా యమునా నది జన్మస్థలం అత్యంత పవిత్రమని భక్తులు వివరిస్తారు. చార్ధామ్ యాత్రలో



యమునోత్రి అత్యంత ప్రధానం యమునోత్రి క్షేత్రంలో గల వేడినీటి గుండంలో స్నానమా



చరించటం ఇక్కడ ప్రత్యేకతగా ఉంటుందని వీర్రాజు చౌదరి తెలిపారు.



# నిరుద్యోగులను నట్టేటముంచిన కూటమి ప్రభుత్వం

- డీఎస్సీ పేరుతో దగా
- ఉద్యోగాలను అమ్ముకున్న వైనం
- డీఎస్సీ పరీక్షలలో అవకతవకలు పట్టించుకోని ప్రభుత్వం
- విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



**మండపేట (మనసులో మాట), జూన్ 3**

నిరుద్యోగులను ఈ రాష్ట్ర ప్రభుత్వం నట్టేట ముంచిందని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు.మండపేట విజయ లక్ష్మీ నగర్ లోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ పేరుతో దగా చేసిందని విమర్శలు చేశారు. టిచర్ ఉద్యోగాలను అమ్ముకున్న వైనం పై మండిపడ్డారు. డీఎస్సీ పరీక్షలలో అవకతవకలు జరిగినా పట్టించుకోని ప్రభుత్వం తీరును దుయ్యబట్టారు.ఈ అంశం లో విద్యార్థులకు న్యాయం జరిగే వరకు వైసిపి ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. యువత జీవితాలతో ఆడుకొనే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. సంబరాలు చేసి మరి ఉద్యోగ నియామకాలు చేశారని చెప్పారు. ఎప్పుడూ డీఎస్సీ నిర్వహించినట్టుగా, వీరే ఏదో గొప్ప చేసినట్లు ప్రవర్తించారని దుయ్యబట్టారు. డి ఎస్ సి లో అవినీతి జరిగిందన్నారు. ఎందుకు ఆ డి ఎస్ సి నీ రద్దు చేసి తిరిగి ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. టీవీ లో చూశామని ఒ అభ్యర్థి తనకు ఎక్కువ మార్కులు వచ్చినా తన తరవాత అభ్యర్థికి ఉద్యోగం వచ్చిందని చెప్పిందన్నారు. ఎంతో మంది అభ్యర్థులు భోరున ఏడుస్తున్నారని చెప్పారు. మార్కులు విధానం, మెరిట్ లిస్ట్ వీటన్నింటిలో తేడాలు ఉన్నాయని ఆరోపించారు. వారి జీవితాలతో ఆడుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. నిరుద్యోగులను ఈ ప్రభుత్వం మోసం చేస్తుందని మండిపడ్డారు.

టిడిపి పార్టీ కార్యాలయం నుండే డీఎస్సీ పేపర్ లీక్ అయిందని ఆరోపణలు చేశారు. డీఎస్సీ నిర్వహణ కార్యాలయంలో ఔట్ సోర్స్ గా పనిచేస్తున్న వ్యక్తి డి ఎస్సీ లో ఫస్ట్ ర్యాంక్ వచ్చాడని చెప్పారు. అతన్ని సస్పెండ్ చేశారని ర్యాంక్ రద్దు చేశారని చెప్పారు. ఇవన్నీ తప్పు జరగబట్టే చేశారని వివరించారు. ఎందుకు ఈ డీఎస్సి రద్దు చేయడం లేదని నిలదీశారు. కష్టపడి చదివిన వారు అన్యాయం అయ్యారని పేర్కొన్నారు. డీఎస్సీ లో డబ్బులు తీసుకున్నారని ఓ వ్యక్తి కోర్టు కు వెళ్లారని తెలిపారు. రాష్ట్రం అంతా దీనిపై గగ్గోలు పెడుతుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం నిజాయితీ నిరూపించుకోవాలని తక్షణమే ఈ డీఎస్సీ రద్దు చేసి తిరిగి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున విద్యార్థులు, అభ్యర్థులు లకు అండగా నిలిచి ప్రజా పోరాటం చేస్తామని తోట త్రిమూర్తులు హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు,గూటం సత్యనారాయణ, పోతంశెట్టి సత్యనారాయణ రెడ్డి, మెండి బాపిరాజు, గారపాటి అశోక్, తోరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# రెచ్చిపోతున్న 'గొలుసు దొంగలు'

- భయపడుతున్న నగర ప్రజలు

**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

తూర్పు గోదావరి జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరం నగరంలో 'గొలుసు దొంగలు' (చైన్ స్నాచింగ్) రెచ్చిపోతున్నారు. నిత్యం ఎక్కడో అక్కడ ఇటువంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నా..గొలుసు దొంగలను మాత్రం కట్టడి చేయలేకపోతున్నారు. బుధవారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో దానవాయిపేట పార్కు, లాలా చెరువు సర్వీసు రోడ్డులో రెండు చైన్ స్నాచింగ్ ఘటనలు జరిగాయి. ఇందుకు సంబంధించి సీసీ పుటేజ్ లలోని దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిందితులు ఇద్దరు..రెడ్ అండ్ బ్లాక్ కలర్ పల్సర్ 220 బైక్ పై తిరుగుతున్నారు.బైకగ నడుపుతున్న వ్యక్తి వైట్ షర్ట్ ధరించి హెల్మెట్ పెట్టుకున్నాడు. వెనుక కూర్చున్న వ్యక్తి బ్రౌన్ కలర్ షర్ట్, బ్లాక్ ప్యాంట్ ధరించి మాస్క్ పెట్టుకున్నాడు. సీసీ పుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఏ ఏరియాలోనైనా కనిపిస్తే వెంటనే పట్టుకుని పోలీసులకు సమాచారం అందజేసి సహకరించాలని పోలీసులు కోరుతున్నారు. బ్లూ కోల్ట్స్ పెట్రోలింగ్ పార్టీలు టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ తో విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచాలని కోరుతున్నారు. ముఖ్యమైన జంక్షన్లు, సెన్సిటివ్ ప్రాంతాలలో వాహన తనిఖీలు నిర్వహించి చైన్ స్నాచింగ్ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం నగర ప్రజలు కోరుతున్నారు.



# కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కు అభినందనలు

**రాజోలు జూన్ 3, మనసులోమాట:**

కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన డీకే శివకుమార్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామని పిసిసి సభ్యులు రుద్రరాజు గోపాలకృష్ణరాజు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం లక్కవరం గ్రామంలో ఆయన బుధవారం మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రిగా అలుపెరగని కాంగ్రెస్ శ్రామికుడు, కింగ్ మేకర్, దమ్మున్న నాయకుడు, బడుగు బలహీన వర్గాల వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయుచున్న వ్యక్తిగా డీకే శివకుమార్ 25వ ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టనున్న శుభ సందర్భంలో వారికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని అన్నారు. శివకుమార్ 47 ఏళ్లుగా పార్టీకి విధేయుడుగా ఉంటూ కర్ణాటకలో సాతనూరు శాసనసభ నియోజవర్గం నుండి 9 సార్లు పోటీ చేసి 8 సార్లు విజయం సాధించిన ఘనత శివకుమార్ దక్కుతుందన్నారు. 1985లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో దేవగౌడ పై గట్టి పోటీ ఇచ్చి స్వల్ప మెజారిటీతో ఓడిపోయారని అన్నారు. కర్ణాటక పిసిసి అధ్యక్షులుగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టిన నాటికి రాష్ట్రంలో 40 లక్షలు కాంగ్రెస్ సభ్యత్వాలు ఉన్నాయని, శివకుమార్ పిసిసి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాలు 90 లక్షలు చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. ఇటువంటి నాయకులను కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ పెద్దలు గుర్తించి దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల పి సి సి సభ్యులను ప్రక్షాళన చేయాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేస్తే 2029లో జరిగే పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని తెలిపారు. దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని చేయాలని లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, బడుగు బలహీన వర్గాల వారు కోరు కుంటున్నారని అన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమం

**చింతలపూడి( మనసులో మాట) జూన్ 3 :**

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చింతలపూడి మండల పరిషత్ మీటింగ్ హాలు లో పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పారిశుధ్య కార్మికుల సామర్థ్యాన్ని పెంపొందించడానికి, ఘన వ్యర్థాల నిర్వహణ మీద వృత్తిరీత్యా రక్షణ, అంశాలు వాటి వల్ల ఉపయోగాలు, కార్మికులకు ప్రథమ చికిత్స వంటి అంశాలపై అవగాహన కల్పించారు. భారతదేశ వ్యవస్థ నమస్తే పథకం స్వచ్ ఆంధ్ర, స్వర్ణాంధ్ర పథకాలు ఆరోగ్య ప్రమాద బీమా పథకాలు గురించి తెలియపరిచారు. శానిటరీ వర్కర్లకు కోటి రూపాయలు, ఔట్సోర్సింగ్ వర్కర్లకు 20 లక్షలు ప్రమాద బీమా తీసుకురావడం జరుగుతుంది అని వారికి పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్, అంబటి.రాంబాబు, శానిటరీ ఇన్స్పెక్టర్ రత్నకుమార్, ఎం. నాగేశ్వర రావు (ట్రైనింగ్ కన్సల్టెంట్, సాహసంస్థ & వాష్ ఇన్స్టిట్యూట్), జిల్లా కోఆర్డినేటర్ జి ఎస్ ఆర్ రాజు (వాష్ ఇన్స్టిట్యూట్) తదితరులు పాల్గొన్నారు.



# కొత్త పేట ఆర్డీఓ గా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ



**అమలాపురం( మనసులోమాట) జూన్ 3:**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొత్తపేట ఆర్డిఓ గా జీవి సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత మూడు నెలలుగా ఇక్కడ ఇంచార్జ్ ఆర్డీవో గామమ్మీ బాధ్యతలు చేపట్టారు. రెగ్యులర్ ఆర్డీవో లేకపోవడం వలన రెవెన్యూ పరమైన పనులు చాలా పెండింగ్లో ఉన్నాయి. దీంతో జీవి సత్యనారాయణ రెగ్యులర్ ఆర్డీఓగా బుధవారం బాధ్యతలు తీసుకోవడంతో కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. ఆర్డీవో గా బాధ్యతలు చేపట్టిన జీవి సత్యనారాయణ ప్రసిద్ధి చెందిన అయినవిల్లి శ్రీ సిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శేషవస్త్రంలతో ఆయనను సత్కరించారు.



# రేపటి నుంచి వైసీపీ నిరసన కార్యక్రమాలు

- నియోజకవర్గ కోఆర్డినేటర్ రఘురాం నాయుడు

**తాడేపల్లిగూడెం (మనసులో మాట) జూన్ 3 :**

రాష్ట్రంలో చంద్రబాబు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 4, 9, 12వ తేదీల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డీ రఘురాం నాయుడు తెలిపారు. బుధవారం తాడేపల్లిగూడెం వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్ను ఆవిష్కరించారు. రఘురాం మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 4వ తేదీన తాడేపల్లిగూడెం మండలం, పెంటపాడులో, 8 లేదా 9వ తేదీన తాడేపల్లిగూడెం టౌన్, 12వ తేదీన నియోజకవర్గ స్థాయిలో నిరసన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇదిలా ఉంటే, గత రెండేళ్లలో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పరిస్థితులపై ఈ నెల 4, 5, 9, 12వ తేదీల్లో గళమెత్తనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు గొర్రెల శ్రీనివాస్, చిట్టూరి బాపన్న, కాకర్ల శ్రీనివాస్, కైకాల శ్రీనివాస్, ద్వారపురెడ్డి శ్రీనివాస్, గణపతి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్యకు తక్షణమే పరిష్కరణ

- ఎమ్మెల్యే శిరీష దేవి

**రంపచోడవరం (మనసులో మాట); జూన్ 3,**

పోలవరం జిల్లా వి. ఆర్. పురం మండలంలోని చొప్పల్లి గ్రామంలో కొంత భాగం ఎంతో కాలంగా తాగునీటి సమస్యతో ప్రజలు బాధపడుతున్నారు, సర్పంచుల పదవి కాలం ముగియడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి కి సమస్యను తెలపగా స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే అధికారులతో చెప్పి ఆ సమస్యను పరిష్కరించి, త్రాగునీటిని అందించారు. నీటి సమస్యతో బాధపడుతున్న చొప్పల్లి గ్రామస్తులు ఆనందంతో ఎమ్మెల్యే కి, టిడిపి మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ మాట్లాడుతూ ఇది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి ప్రతి కుటుంబానికి న్యాయం చేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఐటిడిపి కన్వీనర్ ఆకోజు భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ఉర్మ ఆదమ్మ, సీనియర్ నాయకులు బోదె బోయిన సురేష్ రావు, బొర్రా సూరిబాబు, మీడియం వీరయ్య, ఉర్మ సీతారామయ్య, ఊర్మ బుచ్చయ్య, కారం చిరంజీవి, నీలం రాజా, జంగాల ప్రేమ్ సాగర్, కారం సత్యం, ధర్మల బాబు, కారం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి

- కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం( మనసులోమాట) జూన్ 3:**



భారత ఎన్నికల సంఘం ఆశయాలకు అనుగుణంగా, వంద శాతం పారదర్శకమైన, తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించ డమే లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ బృహత్తర కార్యాన్ని విజయవంతం చేయడానికి అధికారులు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. వలస ఓటర్ల గుర్తింపు, మ్యాపింగ్ పై ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మొదటి దశ మ్యాపింగ్ అంశంపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాకుండా, ఎలాంటి డూప్లికేట్, వలస ఓట్ల గందర గోళం లేని స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించడానికి అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల మ్యాపింగ్, డేటా సరిపోల్చడంపై బీఎల్ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నా రు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో మొదటి దశ అత్యంత కీలకమన్నారు. 2002 డేటాతో ప్రస్తుత డేటాను సరిపోల్చే 'టేబుల్ ఎక్సర్‌సైజ్'ను పక్కాగా నిర్వహించాలన్నారు. భారత ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని జిల్లాలో ఎలాంటి తప్పులు లేకుండా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి మహేష్ కుమార్ బూత్ స్థాయి అధికా రులను ఆదేశించారు. ఈ సవరణ ప్రక్రియ లో భాగంగా నిర్వహించాల్సిన మొదటి దశ ఓటర్ల మ్యాపింగ్, డేటా సరిపోల్చడం మరియు టేబుల్ ఎక్సర్‌సైజ్ విధా నాలపై ఆయన బీఎల్ఓ లకు అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ల జాబితా పునర్వ్యవస్థీకరణలో భాగంగా మొదటి దశ ఓటర్ల మ్యాపింగ్ అత్యంత కీలకమైనదన్నారు. ప్రతి ఓటరును వారి సంబంధిత పోలింగ్ కేంద్రం పరిధితో ఖచ్చి తంగా మ్యాప్ చేయాలని స్పష్టం చేశారు. 2002 డేటాతో సరిపోల్చడం గతంలో ఉన్న 2002 నాటి ప్రాథమిక డేటాను, ప్రస్తుతం మన వద్ద అందుబాటు లో ఉన్న తాజా డేటాతో క్షుణ్ణంగా సరిపోల్చాలని ఆదేశించారు.

రెండు డేటాల మధ్య ఉన్న వ్యత్యాసాలను గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నా రు. క్షేత్రస్థాయి పరిశీలనకు ముందు కార్యాలయంలో కూర్చుని చేసే 'టేబుల్ ఎక్సర్‌సైజ్' ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. డూప్లికేట్ ఓట్లు, మరణించిన వారి పేర్లు, ఒకే ఇంటి నెంబరుపై వందల సంఖ్య లో ఉన్న ఓట్లను ఈ ప్రక్రియ ద్వారా ప్రాథమికంగా గుర్తించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా నాణ్యత అంతా బీఎల్ఓల పనితీరుపైనే ఆధారపడి ఉంటుందని, ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. అర్హులైన యువ ఓటర్ల నమోదు, తప్పుల సవరణలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. వలస ఓటర్ల ఖచ్చితమైన గుర్తింపు ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులకు తావు ఉండకూడదని. ఉపాధి, వ్యాపారం లేదా ఇతర కారణాల వల్ల తాత్కా లికంగా వలస వెళ్లిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, అలాగే వేరే నియో జకవర్గాల్లో నివసిస్తున్న వారిని క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి గుర్తించాలన్నారు. క్షేత్రస్థాయిల బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటినీ సందర్శించి, నివాసం ఉండని వారి వివరాలను సేకరించాలన్నారు. శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేరును జాబితా నుండి తొలగించే ముందు చట్టప్రకారం ఖచ్చి తంగా నోటీసులు జారీ చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా నిబంధనలు పాటించాలన్నారు. ఒకే ఓటరుకు రెండు వేర్వేరు నియోజకవర్గాల్లో ఓటు హక్కు ఉంటే, ప్రస్తుతం వారు నివసి స్తున్న ప్రాంతాన్ని బట్టి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసి, ఒకే చోట ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ప్రకటించిన ప్రత్యేక సమగ్ర సవరణ క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం నిర్దేశిత గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్లను భాగస్వామ్యం చేయాలని, క్షేత్ర స్థాయి మార్పులపై వారికి సమాచారం అందిస్తూ పారదర్శకతను కాపాడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో వి.సుబ్బారావు, ఎన్నికల ఉపతాహసిల్దార్ శివరాజు తదితరులు పాల్గొన్నారు.



# టిడిపిని పటిష్ట పరిచే విధంగా కార్యకర్తలు, పార్టీ బాధ్యులు కృషి చేయాలి

- చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్

**చింతలపూడి( మనసులో మాట) జూన్ 3 :**

టిడిపిని మరింత పటిష్ట పరిచే దిశగా కార్యకర్తలు పార్టీ బాధ్యులు కృషి చేయాలని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ సూచించారు. చింతలపూడిలో బుధవారం యూనిట్ స్థాయి సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ కార్యకర్తల మధ్య సమన్వయం ఉండాలని, పార్టీ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తోటి వారికి ప్రజలకు తెలియ పరచడం క్షేత్రస్థాయిలో రాజకీయాలపై పూర్తి స్థాయి అవగాహనతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయడం తరచూ ప్రజల మమేకమవుతుంది వారికి అవసరమైన సేవలు అందించే కార్యక్రమాలు కార్యకర్తలు నిమగ్నం కావాలన్నారు. ఇకపై నిరంతరం పర్యవేక్షణ సమీక్షలతో పార్టీని సంస్థాగతంగా బలపేతం చేస్తూ ముందుకు సాగనున్నట్లు ఎమ్మెల్యే రోషన్ కుమార్ కార్యకర్తలకు తెలిపారు. ఈ సమావేశంలో చింతలపూడి మండలంలోని యూనిట్ ఇన్చార్జీలు, బూత్ ఇంచార్జీలు, కే ఎస్ ఎస్ లు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి.. డాక్టర్ ఆర్థిక సహాయం

**రంపచోడవరం (మనసులోమాట) జూన్ 3**

పోలవరం జిల్లా వి. ఆర్. పురం మండలంలోని చిన్న మట్టపల్లి పంచాయతీ ప్రతిపాక గ్రామస్తుడు పెద్ద కన్నరావు గత నెల పాముకాటుకి గుర్రై మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ సుందర్ ప్రసాద్ మృతుని కుటుంబనికి 5000 రూపాయలు ఆర్థిక సాయం ను ఆయనకు తెలిసిన వారి ద్వారా బాధిత కుటుంబానికి అందించారు. గతంలో రేఖపల్లి ప్రభుత్వ వైద్య శాలలో పని చేసిన నప్పటి నుండి డాక్టర్ సుందర ప్రసాద్ ఈ ప్రాంత ప్రజలకు వైద్యాలు అందించటమే కాకుండా ఎంతో మంది అభాగ్యులకు ఆర్థిక సేవలు అందించి ఆదుకున్నారాయన. ఆయన చేసిన సహాయంకి ప్రజల హృదయాలు ఎప్పటికీ గుర్తుండి పోయే వ్యక్తి డాక్టర్ సుందర్ ప్రసాద్, ఇలాంటి మనసు ఉన్న డాక్టర్ ని ఎప్పటికీ సాయం చేసిన కుటుంబాలు మర్చిపోమని డాక్టర్ సుందర్ ప్రసాద్ కి వారి కుటుంబం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ సోడి కవిత, వేటి సంధ్య, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ పిట్ల రామారావు, కోటం జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA

# ఘనంగా కామ్రేడ్ బోడ వజ్రం సంస్మరణ సభ

**చింతలపూడి ( మనసులో మాట) జూన్ 3 :**




కామ్రేడ్ బోడ.వజ్రం తనువు చాలించటం వ్యవసాయ కార్మిక సంఘానికి,సిపిఐ పార్టీకి తీరని లోటని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని. వనజ అన్నారు. చింతలపూడి పట్టణం పాత చింతలపూడి గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ బోడ.వజ్రం సంస్మరణ సభ బుధవారం సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి. వసంతరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బోడ.వజ్రం మరణానికి చింతిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని.వనజ మాట్లాడుతూ కామ్రేడ్ బోడ.వజ్రం జీవితం వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ పార్టీతోనే కొనసాగించారని అని ఆమె అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో బోడ.వజ్రం దృఢ సంకల్పంతో పనిచేశారని ఆమె అన్నారు. కామ్రేడ్ వజ్రం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె తెలిపారు. ఎక్స్ ఎమ్మెల్సీ గౌరవ అధ్యక్షులు జల్లి. విల్సన్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎర్ర జెండాను నమ్ముకుని మేలిమి వజ్రం లాగా పని చేసిన వ్యక్తి కామ్రేడ్ బోడ.వజ్రం అని ఆయన అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘానికి ప్రత్యేక స్థానం ఉందని ఆయన అన్నారు. పెత్తందారు వ్యవస్థను, అంటరానితనాన్ని నిర్మూలించడానికి నిర్మూలించడానికి పేద ప్రజలను సమీకరించి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. పేదవారికి న్యాయం చేయాలని సంకల్పంతో బోడ వజ్రం సిపిఐ పార్టీలో పనిచేశారని ఆయన అన్నారు. అడవులు నాశనం అవుతున్నాయని వన సంరక్షణ సమితులు ఏర్పాటు చేయడంలో బాడ వజ్రం కీలక పాత్ర పోషించారని ఆయన అన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగ.ప్రభాకర్ మాట్లాడుతూ బోడ. వజ్రం 1973వ సంవత్సరంలో కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకున్నారని ఆయన వ్యవసాయ కార్మిక కుటుంబం నుంచి వచ్చారని కూలి పని చేసుకుని జీవించేవారని ఆయన తెలిపారు. ఆయన కమ్యూనిస్టు పార్టీలో వచ్చేనాటికే కమ్యూనిస్టు పార్టీ పాత చింతలపూడి గ్రామంలో బలంగా ఉండేదని తెలిపారు.1975 సంవత్సరంలో గాంధీనగర్ కాలనీలో పేదలకు ఇళ్ల స్థలాల పోరాటంలో మాదాసు. శేషగిరిరావు, కాశిల తొ కలిసి పోరాటం చేసి పేద ప్రజలకు పట్టాలి ఇప్పించారని ఆయన తెలిపారు.

బి కే యం యు జిల్లా కార్యదర్శి బండి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘంలో బాధ్యతలు తీసుకుని పనిచేశారని ఆయన తెలిపారు. చింతలపూడి మండల పరిధిలో పాత చింతలపూడి, గనిజర్ల, ఎర్రగుంటపల్లి, రేచర్ల, వెంకటాపురం గ్రామంలోని అటవి బంజర భూములు పేద ప్రజలకు పంచిపెట్టాలని జరిగిన పోరాటానికి నాయకత్వం వహించారని ఆయన అన్నారు. ఆయన ఎంపీటీసీగా ఎన్నికయి తన బాధ్యత నిర్వర్తించాడని తెలిపారు. చింతలపూడి వందపడకల ఆస్పత్రి, బస్సు డిపో కోసం పోరాటం చేశారని ఆయన తెలిపారు. తమ్మిలేరు జలాశయం ఎత్తిపోతల పథకం పెట్టి చింతలపూడి పెద్ద చెరువు సాగు, త్రాగునీరు అందించాలని ఆందోళనలో ఆయన పాల్గొన్నారు అని అన్నారు. పాత చింతలపూడి కి చెందిన చెరువుల అభివృద్ధికి స్మశాన వాటిక కోసం కృషి చేశారని ఆయన తెలిపారు. చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, టీ నర్సాపురం మండలంలో పేద ప్రజలకు అటవి బంజర భూముల పట్టాలు ఇప్పించే పోరాటంలో పాల్గొన్నారని ఆయన అన్నారు. పాత చింతలపూడి కమ్యూనిటీ హాల్ సిపిఐ ఎంపీ అజీజ్ భాషా నిధులు మంజూరు చేయించి కమ్యూనిటీ భవన నిర్మాణం చేయించారని ఆయన తెలిపారు. చింతలపూడి చుట్టుప్రక్కల పేదలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు వైద్యం అందేలా చూశారని ఆయన అన్నారు. తాసిల్దార్ కార్యాలయంలో చింతలపూడి మండలానికి చెందిన గణిజర్ల, వెంకటాద్రి గూడెం, వెంకటాపురం,కాంతంపాలెం, పాత చింతలపూడి కి చెందిన ప్రజలకు పట్టాలిప్పించారని ఆయన తెలిపారు. సుదీర్ఘకాలంగా సిపిఐ కమిటీ సభ్యులుగా, జిల్లా కౌన్సిల్ మెంబర్గా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘంఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు. చింతలపూడి లో సిపిఐ పార్టీ పిలుపునందుకొని వనసంరక్షణ సమితులనిర్మాణంలో కీలకంగా వ్యవహారించారు.

వివాదరహితుడు, పార్టీలకుఅతీతంగా పనిచేసి వివాద రహితుడుగా మంచి పేరు తెచ్చుకున్న ఏకైక వ్యక్తి బోడ వజ్రం అన్నారు. పాత చింతలపూడి గ్రామంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సిపిఐ పార్టీ సహకరిస్తుందని పార్టీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి కే యం యు జిల్లా అధ్యక్షులు కంచర్ల.గురవయ్య, సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి. బాబు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పులూరి. హేమశంకర్, సిపిఎం చింతలపూడి మండల కార్యదర్శి పాండురంగారావు, సిపిఐ ఎంఎల్ రెడ్ స్టార్ నాయకులు డి. రంగనాథ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు టీవీఎస్ రాజు, పుప్పాల. కన్నబాబు, బి.ఎన్. సాగర్, డి. కృష్ణ, పి.సోమశేఖర్, తొర్లపాటి. రాజు, గ్రామ శాఖ కార్యదర్శి ముళ్లగిరి.నాగేశ్వరరావు వ్యవసాయ కార్మికసంగం మండల అధ్యక్షులు ముళ్లగిరి.లాజరు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు ఎం .అలెగ్జాండర్, ఎస్.లెనిన్, కే. ఏసుపాదం విప్లవ గేయాలు ఆలపించారు.



## జిల్లాలో అటవీ ప్రాంతాలను గుర్తించి
# నివేదిక సమర్పించండి

- **జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**

**ఏలూరు, జూన్, 1(మనసులో మాట)**

జిల్లాలో అటవీ వంటి ప్రాంతాల గుర్తింపు, డిజిటైజ్, జియోరిఫరెన్స్ పనులు వేగవంతం చేసి నివేదికలు సమర్పించాలని పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం అటవీ భూములు మరియు అటవీవంటి ప్రాంతాలను గుర్తించి,



డిజిటైజ్ చేసి, జియోరిఫరెన్స్ పనుల ప్రగతిపై జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, జిల్లా అటవీశాఖాధికారి సందీప్ రెడ్డి తో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రభుత్వ రికార్డులలో అడవులుగా నమోదు చేయబడిన భూములు, గెజిట్ నోటిఫికేషన్లు, బ్లాక్ మ్యాప్‌లు మరియు కే ఎం ఎల్ లేయర్‌లను ఉపయోగించి అటవీ బ్లాక్‌ల డిజిటైజేషన్ మరియు జియోరిఫరెన్సింగ్‌తో పాటు, క్షేత్ర స్థాయి ధృవీకరణ చేయాలన్నారు.అదేవిధంగా జిల్లాలో జిల్లాలో నోటిఫైడ్ అడవులు అన్‌నోటిఫైడ్ అడవులు, ఆక్రమణలు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ ప్రాంతాలు, క్షీణించిన మరియు చెట్లు లేని భూములు, మరియు ప్రభుత్వ అలాగే ప్రైవేట్ తోటల పెంపకంపై డేటా సేకరణ చేయాలన్నారు. అటవీ భూములను గుర్తించి డిజిటైజ్ చేసే సమయంలో ఆర్.ఎస్.ఆర్., ఆడంగల్ , మ్యుటేషన్, క్షేత్రస్థాయిలో ప్రస్తుత పరిస్థితి లను పరిశీలించి, జియోరిఫరెన్స్ పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు.

# ర్యాలీలో ఆపరేషన్ వజ్రప్రహార్ నిర్వహించిన పోలీసులు

- **పాల్గొన్న కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్, సీఐ విద్యాసాగర్**
- **గంజాయి డ్రగ్స్ సేవించే వారిని గుర్తించండి పోలీసులు సహకరించండి**
- **రికార్డ్ లేని వాహనాలు తనిఖీలు సీజ్**

**కొత్తపేట( మనసులో మాట) జూన్ 3**

మాదకద్రవ్యాలు (గంజాయి తదితర), అక్రమ మద్యం రవాణా నియంత్రణ, నేరాల అదుపునకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 'ఆపరేషన్ వజ్రప్రహార్' ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామంలో డాక్టర్ బి.ఆర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆదేశాల మేరకు , బుధవారం తెల్లవారు ఆరు గంటల సమయంలో కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్, ఆధ్వర్యంలో, రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్ ఐ ఎస్ రాము సిబ్బందితో కలిసి ఆపరేషన్ వజ్రప్రహార్ తనిఖీలు నిర్వహించారు. అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలు, స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ ఇన్సూరెన్స్ లేని వాహనాలపై చలన విధించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. అనుమానత వ్యక్తులు గంజాయి పై దృష్టి సారించారు. ఈ సందర్భంగా కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ మాట్లాడుతూ, గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే ప్రధాన లక్ష్యమని, రాష్ట్రంలో పలు చోట్ల ఆపరేషన్ వజ్రప్రహార్ కార్డెన్ చర్చ్ జరుగుతుందన్నారు. అనంతరం యువతకు గంజాయి, డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. చోరీ చేసిన వాహనాలను విక్రయించిన,



కొన్న, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు మత్తు పదార్థాలు, సేవిస్తున్న , విక్రయించిన, వారి వివరాలు పోలీసులకి తెలియజేయాలన్నారు. మన ఊరు క్షేమం, మన చేతుల్లోనే ఉందని , గంజాయి డ్రగ్స్ కు బానిసలుగా మారిన వారు, మృగాళ్ల ప్రవర్తిస్తూ, ఆడపిల్లలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, కొట్లాటకు దిగుతూ, ఊరిని భయభ్రాంతులకు గురిచేస్తారన్నారు. అలాంటి వాళ్ళను గుర్తించి, పూర్తిగా నిర్మూలించడానికి ప్రజలు, గ్రామస్తులు సహకరించాలని కోరారు.



## పాఠశాల గుర్తింపు
# రద్దు అవాస్తవం

- శ్రీ వేద ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ బండారు సూర్య ప్రకాష్ రావు

**రౌతులపూడి (మనసులో మాట)జూన్ 03:**

ఇటీవల కాలంలో రెండు ప్రధాన పత్రికలో శ్రీ వేద ఇంగ్లీష్ మీడియం స్కూలు వచ్చిన వార్తలు అవాస్తమని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బండారు సూర్యప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మా పాఠశాలకు సంబంధించిన అన్ని అనుమతులు ఉన్నాయని మా పాఠశాల పై అవస్తవాలు రాయడం తగదని మాకు జిల్లా విద్యాశాఖ అధికారి సోకాజ్ నోటీసు ఇచ్చిన మాట వాస్తవం అని కానీ దానికి వివరణ ఇచ్చామని సూర్య ప్రకాశరావు తెలిపారు. పాఠశాల రద్దు అని పేపర్లలో ప్రచురించడం వల్ల మా పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన గురవుతున్నారని దయచేసి వాస్తవాలు తెలుసుకొని రాయాలని సూర్య ప్రకాశ్ రావు అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ అల్లు సత్యనారాయణ, డైరెక్టర్స్ బండారు నాగు, ఎనుముల కోటేశ్వరరావు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పార్టీ కోసం శ్రమించిన సైనికుడికి లభించిన భరోసా

- మృతుడి కుటుంబానికి చేరిన రూ. 5 లక్షల బీమా క్లెయిమ్

**కాకినాడ (మనసులో మాట) జూన్ 3**

కరప రూరల్ మండల కేంద్రం అయిన కరప తెలుగుదేశం పార్టీ సంక్షేమమే ధ్యేయంగా కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్న నారా చంద్రబాబు నాయుడు నారా లోకేశ్ ల పిలుపునకు అనుగుణంగా కాకినాడ జిల్లాలో మరో బాధిత కుటుంబానికి కొండంత అండ లభించింది. పార్టీని నమ్ముకుని ప్రజా సేవలో నిరంతరం శ్రమించిన కరుడుగట్టిన కార్యకర్త త్రిమూర్తులు మేనవల్లి అకాల మరణం ఆ పార్టీ కుటుంబంలో తీరని లోటును మిగిల్చింది. కష్టకాలంలో సైతం పసుపు జెండాను గుండెల్లో మోస్తూ పార్టీ వెన్నంటే నడిచిన ఒక నిజమైన సైనికుడిని కోల్పోవడంపై స్థానిక టీడీపీ నాయకత్వం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఈ విపత్కర పరిస్థితుల్లో సదరు కార్యకర్త కుటుంబం ఆర్థికంగా కుంగి పోకుండా ఉండేందుకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం తక్షణమే స్పందించింది. పార్టీ సభ్యత్వ నమోదు (సభ్యత్వ నెంబరు: 7201488) ద్వారా కల్పించిన రూ. 5 లక్షలు (అయిదు లక్షల రూపాయలు) ప్రమాద బీమా క్లెయిమ్ మొత్తాన్ని మృతుడి నామినీ అయిన వీరరాఘవులు మేనపల్లి (ఇంటి నెంబర్ 219 అరట్లకట్ట కరప మండలం) బ్యాంక్ ఖాతాకు బుధవారం విజయవంతంగా బదిలీ చేశారు. మే 29, 2026న ఈ నగదు బదిలీ ప్రక్రియ పూర్తయినట్లు కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి) అధికారికంగా ధ్రువీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లబత్తుల అప్పారావు కరప మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గుల్లిపల్లి శ్రీనివాస్ ఆరవ క్లస్టర్ ఇంచార్జ్ వాసంశెట్టి వీరాంజనేయులు (అంజిబాబు) కాకరపల్లి చలపతిరావు బొబ్బిలి గోవిందు గీసాల శ్రీనివాస్ వాసంశెట్టి శ్రీనివాస్ నచెల్లిపోయిన సూర్యప్రకాశరావు రుతల రవి మార్కండేయులు గుడాల లోవరాజు మందరపు చిట్టిబాబు నీలా రాంబాబు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమన్వయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం (మనసులో మాట) జూన్ :**




రాజకీయ నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పెంటపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కట్టుబోయిన వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారుల తో పని చేయించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. లేకుంటే ఆ ప్రభావం ప్రభుత్వంపై పడుతుందన్నారు. అధికారులను ప్రతీ ఒక్కరూ గౌరవించాలన్నారు. కొంతమంది వీఆర్వోలు ప్రజల నుంచి సొమ్ములు డిమాండ్ చేస్తున్నారని, గతంలో కూడా తాను హెచ్చరించినా వారిలో మార్పు రాలేదన్నారు. ఎకరం భూమి ఆన్ లైన్ చేయడానికి వీఆర్వో రూ.22వేలు డిమాండ్ చేశారని, రైతును ఇబ్బంది పెట్టే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయడానికే అధికారులకు జీతాలు ఇస్తున్నారని గుర్తు చేశారు. ఇదిలా ఉంటే తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో గత జనగణనతో పోల్చుకుంటే 34 వేలు జనాభా తగ్గిందని తెలిపారు. గ్రామ నాయకులు, సచివాలయ సిబ్బంది ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో మమేకం కావాలని కోరారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా, పింఛన్లు, ఇంటి స్థలాలు అందించేందుకు కృషి చేస్తుందన్నారు. తొలుత శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ వరలక్ష్మి, ఎంపీడీవో రాంప్రసాద్, తహశీల్దార్ సునీల్, మాజీ ఎంపీటీసీ కట్టు బోయిన కృష్ణ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు




- ప్రజలను మోసం చేసిన పాలనకు నిదర్శనం
- కొత్తపేట నియోజకవర్గ వైసిపి నాయకుల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ

**కొత్తపేట( మనసులో మాట) జూన్ 3**

రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కొత్తపేట నియోజకవర్గ వైసిపి ముఖ్య నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి పేరుతో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని గాలికొదిలేసి ప్రజల విశ్వాసానికి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందన్నారు.

ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్ర ప్రజలు ఆశించిన అభివృద్ధి కనిపించలేదని, ధరల పెరుగుదల, నిరుద్యోగం, సంక్షేమ పథకాల కోతలు ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేశాయని నాయకులు పేర్కొన్నారు.

వైసిపి హయాంలో అమలైన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిలిపివేయడం వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరిగిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వాన్ని తిరిగి తీసుకురావడానికి వైసిపి కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కర్రి నాగిరెడ్డి, గొల్లపల్లి డేవిడ్, చల్లా ప్రభాకర్ రావు, సాక ప్రసన్న కుమార్, మార్గాన్ని గంగాధర్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పోస్టర్ ఆవిష్కరణను విజయవంతం చేశారు.




## 5న ఉద్యానవర్సిటీలో
# రైతు సదస్సు

**తాడేపల్లిగూడెం (మనసులో మాట), జూన్ 3**

రైతు సదస్సు ఈ నెల 5వ తేదీన ఉదయం 10:30 గంటలకు ఉద్యాన విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నట్లు ఉప కులపతి డాక్టర్ కే. ధనుంజయరావు తెలిపారు. గురువారం తాడేపల్లిగూడెం మండలం వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరగనున్న రైతు సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హాజరవుతారన్నారు. ఆయనతో పాటు కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, ఉపసభాపతి రఘురాం కృష్ణంరాజు, రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, పశ్చిమగోదావరి, ఏలూరు కలెక్టర్లు నాగరాణి, వెట్రీ సెల్వి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా , తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. రైతాంగానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులను తెలియజేసేందుకు ఈ సదస్సులో 100 ప్రైవేట్ కంపెనీలు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, రూ.6.7 కోట్లతో నిర్మించిన రెండవ ఫేస్ పరిపాలన భవనాన్ని, బాలికల వసతి గృహాన్ని ప్రారంభిస్తారన్నారు. బాలికల వసతి గృహ మూడో బ్లాక్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని, ఈ భవన నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం రైతు సదస్సులో డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ, సెన్సార్ టెక్నాలజీ పై రైతులకు అవగాహన కల్పిస్తారని వివరించారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.మాధవి, విస్తరణ సంచాలకులు డాక్టర్ సీహెచ్. రూత్ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలోనే నిరుపేదలకు ఆరోగ్య భరోసా

- నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి గొప్పవరం
- నూజివీడు నియోజకవర్గంలో 2 ఏళ్లలో రూ 14.50 కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు నిరుపేదలకు అందించాము
- 101 మంది నిరుపేద లబ్ధిదారులకు రూ 61.72 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పంపిణీ చేశారు




**నూజివీడు(మనసులో మాట) జూన్ 03:**

కూటమి ప్రభుత్వంలోనే నిరుపేదలకు ఆరోగ్య భరోసా అని, అందరకీ ఆరోగ్యం బాగుంటేనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మంత్రివర్యులు క్యాంపు కార్యాలయంలో బుధవారం నూజివీడు నియోజకవర్గ పరిధిలో 101 మంది లబ్ధిదారులకు రూ 61.72 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించి, రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి కుటుంబ యోగక్షేమాలు, ఆరోగ్య వివరాలను, గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలకు ఆరోగ్యభరోసాగా ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగ పడుతుందని, లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ జరిగిన మేలును ఇతరులకు తెలపాలని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదవర్గాలు వైద్య ఖర్చులను అందించి, వారు ఆర్థికంగా బలోపేతం అయ్యి సమాజంలో గౌరవంగా జీవించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయ నిధిని పునరుద్ధరించి పెద్దఎత్తున సాయం అందిస్తూ ఆదుకుంటున్నామని తెలిపారు. నూజివీడు నియోజకవర్గ పరిధిలో 101 మందిలబ్ధిదారులకు రూ 61.72 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఈరోజు అందించామని అన్నారు. ఒక్క నూజివీడు నియోజకవర్గంలో రెండు ఏళ్లలో రూ 14.50 కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు నిరుపేదలకు అందించామని తెలిపారు.గత వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి అమలు చేయకుండా నిర్వీర్యం చేసి నిరుపేదలు ఆరోగ్యాన్ని గాలికి వదిలేసారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టించుకోలేదని, గత ప్రభుత్వానికి మానవత్వం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో మేలు పొందిన ప్రతి ఒక్కరూ మరో 10 మందికి తెలియ చెప్పాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో అభివృద్ధి చెంది ఆనందంగా మెలగాలన్నదే కూటమి ప్రభుత్వ ఆశయమన్నారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పెద్ద ఎత్తున వైద్యసాయం అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయని అటువంటి మంచి కూటమి ప్రభుత్వాన్ని అన్నివర్గాలు ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ మరియు నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, ఆయా గ్రామాలు నాయకులు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.




# 4272 టిడ్కో గృహాలు రద్దయిన లబ్ధిదారులకు నగదు జమ

**ఏలూరు - జూన్, 3(మనసులో మాట)**

సకల సదుపాయాలతో టిడ్కో ఇళ్ళు సిద్ధమవుతాయని కోటి ఆశలతో ఎదురు చూసిన లబ్దిదారులకు గత వైసిపి ప్రభుత్వంలో నిరాశే ఎదురైందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. పేదల ఆకాంక్షలను ఏమాత్రం పట్టించుకోని గత వైసిపి ప్రభుత్వ లెక్కలేనితనానికి అదే ప్రత్యక్ష ఉదాహరణ అని ఆయన వ్యాఖ్యానించారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో టిడ్కో గృహాల కోసం గతంలో డిడిల రూపంలో 35వేల రూపాయలు కట్టిన వారికి ఆ సొమ్ములను తిరిగి వెనక్కి చెల్లించే కార్యక్రమాన్ని బుధవారం స్థానిక కండ్రికగూడెంలోని ఒక ఫంక్షన్ హాల్లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఆర్టీసి విజయవాడ జోన్2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, బీజేపి జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్ కిషోర్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.తొలుత వారికి ఆత్మీయ స్వాగతం లభించింది. ఈ సందర్భంగా 14వందల 96 మంది టిడ్కో ఇళ్ళ లబ్దిదారులకు 6కోట్ల, 23లక్షల, 29వేల రూపాయల విలువైన మెగా చెక్కును అందించీ, వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగానే 7గురు లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేసి మిగిలిన వారి ఖాతాల్లో వారి సొమ్ము జమ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ పారదర్శకత, జవాబుదారీ విధానాలతో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని చెప్పారు. అందుకు తార్కాణమే గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా టిడ్కో ఇళ్ళు రద్దైన లబ్దిదారులందరికీ వారు డిడిల రూపంలో చెల్లించిన నగదును తిరిగి చెల్లించడమని వ్యాఖ్యానించారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో గత వైసిపి ప్రభుత్వ హయాంలో మొత్తం 4272 టిడ్కో ఇళ్ళు రద్దెయ్యాయని, దీంతో లబ్దిదారులు చెల్లించిన 14కోట్ల, 89లక్షల, 87వేల రూపాయల డిడి సొమ్ములను వెనక్కి తిరిగి చెల్లించే బాధ్యతను కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. దాంట్లో భాగంగానే తాజాగా 6కోట్ల రూపాయలను లబ్దిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేశామన్న ఆయన,,, వీరందరికీ భవిష్యత్తులో 2లక్షల, 50వేల రూపాయలతో ఇళ్ళు కట్టించి ఇచ్చే బాధ్యతను మరింత వేగవంతం చేయనున్నట్లు ప్రజలు, లబ్దిదారుల కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధికి పట్టం కట్టే విధంగా కూటమికి ప్రజలంతా ముక్తకంఠంతో జై కొట్టాలంటూ ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపునిచ్చారు. నగర మేయర్ నూర్జహాన్, ఆర్టీసి జోన్ చైర్మన్ అప్పలనాయుడు, బీజేపి జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్‌లు మాట్లాడుతూ పేదలకు ఆర్థిక మేళ్ళు చేకూర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా ముందుకెళ్తోందని తెలిపారు.




# కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో విఫలమైంది

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్

**రాజోలు జూన్ 3, మనసులోమాట:**

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మేల విషయంలో పూర్తిగా విఫలమయ్యిందని వైయస్సార్సీపి రాష్ట్ర అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ విమర్శించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన బుధవారం మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. డీఎస్సీ విషయంలో యువతను ప్రభుత్వం మోసం చేసిందని ఆయన విమర్శించారు. ప్రతి ఏడాది డీఎస్సీ నిర్వహిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినప్పటికీ, రెండేళ్లు గడిచిన తర్వాత మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా నియామకాల ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, భారీ స్థాయిలో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. అర్హత, ప్రతిభ కంటే రాజకీయ సిఫార్సులు, అనుకూలతలకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు.



అలాగే ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన సూపర్ సిక్స్ పథకాల అమలులో కూడా ప్రభుత్వం విఫలమైందని అన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ మోసం చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల విషయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయిందని పేర్కొన్నారు. ఏడాదికి ఆరు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని చెప్పి, ఆ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం ప్రజలను నిరాశకు గురి చేసిందని అన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు, రైతులు, మహిళలు, పేద ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు చేస్తూ అసలు సమస్యలను పక్కన పెడుతోందని ఆరోపించారు.



# ఎన్ ఎ ఫ్ ఎస్ ఎఫ్ యాప్ పై అవగాహన సదస్సు

**రౌతులపూడి(మనసులోమాట)జూన్ 03:**

మండలంలోని స్థానిక రైతు సేవా కేంద్రంలో పురుగులు మందుల షాపు యజమానులకు మండల వ్యవసాయ శాఖ అధికారి రెడ్డి శ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ ఎఫ్ ఎన్ ఎఫ్ యాప్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రైతులు అందరూ వచ్చే ఖరీఫ్ సీజన్లో నేషనల్ ఫెర్టిలైజర్ ఫ్రేమ్ వర్క్ యాప్ లో ఎరువులును బుకింగ్ చేసుకోవాలని బుకింగ్ చేసుకున్న మూడు రోజుల్లో క్యూఆర్ కోడ్ వస్తుందని దాని ద్వారా ఎరువులు తీసుకోవాలని ప్రతి ఒక రైతు ఈ యాప్ పై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రెడ్డి ఈశ్వరరావు తెలిపారు. బుధవారం మండల రైతు సేవ కేంద్రంలో ఎరువులు మందుల షాపు యజమానులతో ఎన్ ఎఫ్ ఎస్ ఎఫ్ యాప్ పై అవగాహన సభ నిర్వహించారు. రైతులకు ఈ యాప్ సందేహాలు ఉంటే నేరుగా రైతు సేవ కేంద్రంలకి రావాలని ఆయన తెలియజేశారు.

## డాక్టర్ అంజి నాయక్ జన్మదినం సందర్భంగా అన్నదానం



**ఏలేశ్వరం( మనసులో మాట) జూన్ 3**

**కాకినాడ జిల్లా**
ప్రత్తిపాడు నియోజవర్గం ప్రత్తిపాడు దేవర్ష్ హాస్పిటల్ ఇంచార్జ్ డాక్టర్ అంజి నాయక్ జన్మదినం సందర్భంగా ఆయన సతీమణి డాక్టర్ విజయ కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఏలేశ్వరం బ్రాహ్మణ భోజనం హోటల్ బేత శ్రీనివాస్, దోనేపూడి శ్రీను, పొన్నగంటి సత్తిబాబు సహకారం తో ఏలేశ్వరం బాలాజీ చౌక్ సెంటర్లో వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు మైర్యాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 100 మందికి భోజన పొట్లాలు టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు పెండ్యాల రాజు, మల్లి బాబు,రాజబాబు, దాసరి కృష్ణ, రాజశేఖర్, పిరట్ల రవి,గొల్లపూడి త్రిమూర్తులు,జగన్,కంచర్ల రమేష్, డోర్స్ రమేష్, మెడికల్ షాప్ లక్ష్మణ్, బ్లడ్ టెస్ట్ గణేష్,నీలి పాండురంగ తదితరులు పాల్గొన్నారు

## కాకినాడ శానిటేషన్ విఫలానికి ప్రభుత్వమే కారణం

- **తగిన సిబ్బందిని పెంచకుండా శానిటేషన్ విజయవంతం అవుతుందా... ?**
- **తాటిపాక మధు విమర్శ**

**కాకినాడ (మనసులో మాట) జూన్ 3**



కాకినాడ శానిటేషన్ మైనస్ 4 లో ఉందని సీఎం చెప్పడం విడ్డూరంగా ఉందని వాస్తవ గణాంకాలను తెలియకుండా మాట్లాడుతున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు విమర్శించారు. బుధవారం ఉదయం 14 ,16 ,17 మస్టర్లు సమావేశంలో మున్సిపల్ కార్మికులతో ఆయన మాట్లాడారు కార్మికులను ఉద్దేశించి తాటిపాక మధు మాట్లాడుతూ కాకినాడ పట్టణంలో రెండు లక్షల 50 వేల జనాభా ఉన్నప్పుడు 15 సర్కిల్స్ 15 కాంపెట్ వాహనాలు 15 ట్రాక్టర్లు 1250 మంది సిబ్బంది ఉన్నారని నేడు 5 లక్షల 70 వేల జనాభా కాకినాడలో ఉండగా నేడు కేవలం 800 మంది మాత్రమే ఉన్నారని దాంట్లో 600 మంది మాత్రమే పని చేస్తున్నారని మధు గుర్తు చేశారు.కార్మికులు రిటైర్,మరణాలు అవుతుంటే వారి స్థానంలో కొత్త ఉద్యోగాలు వెయ్యకపోగా అధికారులపై నిందలు వేస్తారా అని ప్రశ్నించారు.
జనాభా తక్కువ ఉన్నప్పుడే సిబ్బంది ఎక్కువగా ఉన్నారని జనాభా పెరుగుతుంటే సిబ్బంది తగ్గుతున్నారని ఇలాంటి విషయాన్ని ప్రజాప్రతినిధులు,జిల్లా కలెక్టర్కు తెలియదా అని ఆయన ప్రశ్నించారు.ప్రస్తుతం 15 కాంపెట్ వాహనాలకు కేవలం నాలుగు మాత్రమే తిరుగుతున్నాయని మిగతావన్నీ రిపేర్ లో ఉన్నాయని మధు తెలిపారు 15 ట్రాక్టర్లకు పది మాత్రమే పని చేస్తున్నాయని అవి కూడా అనేక రిపేర్లతో ఉన్నాయని ఎప్పుడో ఒకప్పుడు అవి మూత పడతాయన్నారు. స్కూల్లో ఉపాధ్యాయులు ఆసుపత్రిలో డాక్టర్లు లేకపోతే ఎలా ఉంటుందో అదే విధంగా కాకినాడ శానిటేషన్ కు సిబ్బంది పెరుగుదలతో పాటు సరైన రిక్రూమెంట్ సరైన పరికరాలు లేకుండా సానిటేషన్ విజయవంతం కాదని మధు తెలిపారు. తక్కువ సిబ్బందితో శానిటరీ ఇన్స్పెక్టర్లు కార్మికుల మీద పని భారం పెట్టి శ్రమదోపిడి చేయాలని చూస్తే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ చూస్తూ ఊరుకోదని అన్నారు.శానిటేషన్ మెరుపడలంటే సిబ్బందిని పెంచుకొని పని చేయించు కోవాలన్నారు. ఇప్పటి వరకు కార్మికులకు యూనిఫారం రైన్ కోట్ గ్లౌజు కొబ్బరి నూనె సోపు చెప్పులు పుష్ కార్ట్స్ బిన్స్ సరఫరా చేయడం మానేశారని ఇవన్నీ పరిష్కరించకుండా శానిటేషన్ విజయవంతం ఎలా అవుతుందన్నారు.
దీనిపై ఈ నెల ఏడో తేదీ భీమవరంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సమావేశం జరుగుతుందని దీంట్లో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకత్వం ,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం చర్చించి పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తారని మధు తెలిపారు.ఏ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి శ్రీనివాస్ కార్యదర్శి తుపాకుల లక్ష్మి నారాయణ అప్పన్న బంగారు రాజేష్ నక్క శ్రీను లక్ష్మణ్ భారతి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

- **జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి టీ శ్రీదేవి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

జిల్లాలోని వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన 5 నుండి 18 సంవత్సరాల లోపు బాలల నుండి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక జాతీయ బాలల పురస్కారాలు (ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్) కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి టీ శ్రీదేవి తెలిపారు. సాహసం, సామాజిక సేవ, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ టెక్నాలజీ, పర్యావరణ పరిరక్షణ తదితర రంగాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశిష్ట విజయాలు సాధించిన భారతీయ బాలలు జూలై 31, 2026 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించవచ్చన్నారు.
కేంద్ర స్థాయి కమిటీ ఎంపిక చేసిన బాలలకు భారత రాష్ట్రపతి చేతుల మీదుగా పతకం, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేయబడుతాయని తెలిపారు. అర్హత గల విభాగాలు సాహసం, సామాజిక సేవ, క్రీడలు,
**కళలు, సంస్కృతి,**
సైన్స్ టెక్నాలజీ, పర్యావరణ పరిరక్షణ దరఖాస్తులతో పాటు సంబంధిత ప్రతిభ, విజయాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఆధార పత్రాలు, అలాగే గతంలో వివిధ పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచురితమైన కథనాల క్లిప్పింగ్స్‌ను కూడా జత చేయాలని టీ శ్రీదేవి కోరారు. జిల్లాలో అసాధారణ ప్రతిభ కనబరిచిన చిన్నారుల వివరాలను పరిశీలనార్థం అందజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర స్థాయి అవార్డులకు..









- **'తూర్పు' జిల్లాకు చెందిన ముగ్గురు గిరిజన విద్యార్థులు ఎంపిక**

**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు గిరిజన విద్యార్థులు విద్యా ప్రతిభతో రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక కావటం జిల్లాకు గర్వకారణమని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేవెన్ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి జిల్లా టాపర్లు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూన్ 5న విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో అవార్డులు ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందజేయ నున్నట్లు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలోని బొమ్మూరు గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదివిన చల్లా తులసి సత్య మాధవి పదవ తరగతిలో 558 మార్కులు సాధించి జిల్లా టాపర్ గా నిలిచి అవార్డుకు ఎంపికైందన్నారు.
అలాగే ఇంటర్మీడియట్ ఎంసీపీ (ఎంపీసీ) విభాగంలో టీ చందు 934 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు సాధించి ప్రత్యేక అవార్డుకు ఎంపికయ్యారన్నారు. అదే విధంగా బైపీసీ విభాగంలో గంగల్ల గాయత్రి 952 మార్కులతో జిల్లా టాపర్ అవార్డుకు ఎంపికైందని తెలిపారు. ఈ ముగ్గురు విద్యార్థులు ఈ నెల 5న నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేవెన్ జ్యోతి తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఇతర గిరిజన విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆమె అభినందించారు.

## చీడిగ ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా త్వరగా అందించాలి

- **మాజీ ఎమ్మెల్యే పిల్లి దంపతులు.**

**కాకినాడ (మనసులో మాట) జూన్ 3**

కాకినాడ రూరల్ చీడిగ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు ఉపాధి హామీ కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ను కలిసి విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి జిల్లా కలెక్టర్‌కు చరవాణి ద్వారా ఎక్స్‌గ్రేషియా మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు . బాధిత కుటుంబాలకు త్వరిత గతిన న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు

# ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ




**కాకినాడ (మనసులో మాట) జూన్ 03**

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ జిల్లా యువజన కార్యాలయం, కాకినాడ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని కాకినాడ డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ తిర్రి గోపి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత శారీరక దృఢత్వం (ఫిట్‌నెస్) పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు.ప్రస్తుతం పెరుగుతున్న ఇంధన ధరలు, భవిష్యత్తులో తలెత్తే ఇంధన కొరతను దృష్టిలో ఉంచుకుని సైకిల్ వినియోగాన్ని, నడకను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని యువతకు పిలుపు నిచ్చారు. ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధికి కూడా తోడ్పడవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ (డి ఎస్ ఏ ) కోచ్‌లు, సెట్రాజ్ ప్రతినిధులు, యువత క్రీడాకారులు స్వచ్ఛంద సేవకులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు

## ఎస్పీ బాలుకు రాకా ఘన నివాళి



**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

గాన గాంధర్వ ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తెలుగు చిత్ర సీమలో మహా మనిషి అని 'రాకా' సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి అన్నారు. తెలుగు భాష కోసం పరితపించారని అన్నారు. బాలు జయంతి సందర్భంగా గోకవరం బస్టాండు సమీపంలోని ఎస్పీ బాలు సాంస్కృతిక మందిరంలో రాకా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం వేడుక నిర్వహించారు. బాలు చిత్రపటానికి పలువురు పుష్పాంజలి ఘటించారు. శ్రీ సూర్య భాస్కరేంద్ర సరస్వతి స్వామి, శ్రీ జ్ఞాన సరస్వతి పీఠం వ్యవస్థాపకుడు తోట సుబ్బారావు,రాకా కార్యదర్శి జీవీ రమణ, ఆడిట్ ఆఫీసరు రామారావు తదితరులు ఎస్పీ బాలు గొప్ప తనాన్ని కొనియాడారు. బాలూతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరిలో ఎస్పీ బాలు గానం చేసిన పాటలను గాయనీ గాయకులు ఆలపించి స్వర నివాళి అర్పించారు. మున్సిపల్ ఇంజనీరు మదర్ షా అలీ, తిరుమల కృష్ణ మోహన్, నాగరత్నమ్మ, భమిడిపాటి రామకృష్ణమూర్తి, గౌరీ శంకర్, ఎం కృష్ణ, ఎం రమేష్, సూర్య కుమారి, మోహన్ పబ్లికేషన్ ఆకుల రామచంద్ర రావు, కేపే రావు తదితరులు పాల్గొన్నారు.

# దళిత ఐక్యతను దెబ్బతీసేందుకే వర్గీకరణ కుట్ర

**పిఠాపురం, (మనసులో మా జూన్ 3:**



భారతదేశ చరిత్రలోనే దళితుల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు జరిగిన అతిపెద్ద రాజకీయ కుట్ర ఎస్సీ వర్గీకరణ అని రాక్స్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్. రత్నాకర్ విమర్శించారు. పిఠాపురంలో బుధవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతో కలిసి చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి వంటి నాయకులు దళితులపై ఈ కుట్రకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో చట్టాలు వచ్చాయని, ఇక చేసేదేమీ లేదని ఎవరూ నిరాశ చెందవద్దని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే అత్యున్నత శక్తి అని, మనమంతా శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడితే ప్రభుత్వాలు సైతం వెనక్కి తగ్గాల్సిందేనని స్పష్టం చేశారు. అసలైన పోరాటం ఇప్పుడే మొదలైందని ఆయన ప్రకటించారు.దళితులు ఎప్పటికీ రాజ్యాధికారం వైపు కన్నెత్తి చూడకుండా ఉండేందుకే ఇటువంటి కుట్రలకు తెరలేపారని రత్నాకర్ మండిపడ్డారు. దళితుల మేనమామగా చెప్పుకునే వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా వర్గీకరణపై తన స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని తొక్కేయాలని చూడటం అత్యంత బాధాకరమన్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు ఇకనైనా స్పందించి ఈ హక్కుల పోరాటంలో చురుగ్గా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు చెన్నం వెంకటేశ్వరరావు, కొప్పుల ప్రేమ్‌బాబు, ఎనుముల సత్తిబాబు, కూసి కొండబాబు, దారా నూకరాజు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలియజేశారు.

# మెగా జాబ్ మేళా ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు..

- **28కి పైగా ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలకు అవకాశం**
- **పాడా పీడీ శివరామ్ ప్రసాద్**
- **నిరుద్యోగులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు**

**పిఠాపురం , (మనసులో మాట) జూన్ 3:**



స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జూన్ 6వ తేదీన నిర్వహించనున్న ప్రతిష్టాత్మక మెగా జాబ్ మేళా ఏర్పాట్లను పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివరామ్ ప్రసాద్, జిల్లా ఉపాధి అధికారి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేసవి తీవ్రత దృష్ట్యా అభ్యర్థుల నమోదు కౌంటర్లు, ఇంటర్వ్యూ హాల్స్, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్, వైద్య సదుపాయాలపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా పాడా పీడీ శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువతకు మెరుగైన ఉపాధి కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ,పాడా సంయుక్తంగా ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో 28కి పైగా ప్రముఖ ప్రైవేట్ సంస్థలు పాల్గొంటున్నాయని, వివిధ విద్యార్హతలు కలిగిన నియోజకవర్గ మ జిల్లా యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూన్ 6వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ మేళాకు అభ్యర్థులు తమ విద్యా ధ్రువ పత్రాలు, బయోడేటాతో హాజరుకావలన్నారు.

# తోట సామాజిక సేవలు స్ఫూర్తిదాయకం

- **సత్తి రవి రెడ్డి**

**కాకినాడ (మనసులో మాట ) జూన్ 3**



స్థానిక సిద్ధార్థ నగర్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు తోట సుబ్రహ్మణ్యం సమాజాభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందిస్తూ పార్కు వాకర్ అసోసియేషన్ కాలనీ వాసులు ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం ఉదయం పార్కులో ఈ అభినందన కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా సంయుక్త కార్యదర్శి శక్తి రవి రెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలకు తన వంతు సహాయ అందిస్తున్న సుబ్రహ్మణ్యం సేవలు అభినందనీయమన్నారు. తోట సుబ్రహ్మణ్యం సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని ఆయన ఆధ్వర్యంలో
సిద్ధార్థ్ నగర్ పార్క్ డెవలప్మెంట్ కి రెండున్నర లక్షలు రూపాయలు
రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆస్పత్రికి పది లక్షలు రూపాయలు
ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఓపెన్ ఆడిటోరియంకు 25 లక్షలు రూపాయలు చందుర్తి లో దాహం తీర్చేందుకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు ఇలా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న వ్యక్తి సిద్ధార్థ నగర్ వాస్తవ్యులు కావడం చాలా గర్వకారణంగా ఉందని అందరూ పుష్పగుచ్చాల తో అభినందించారు.

**ఈ కార్యక్రమంలో**
సెక్రటరీ రాజా వెంకటేష్
మాజీ కార్పొరేటర్ మణికుమార్
సత్యనారాయణ రంగారావు సుబ్బారావు శ్రీనివాసరావు ఆలపాటి శ్రీనివాస్ బాబి తోపాటు పలువురు పాల్గొన్నారు

# అనపర్తి అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నప్రసాద సమర్పణ

**అనపర్తి ( మనసులో మాట),జూన్ 3:**

అనపర్తి మండలం అనపర్తి శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం నందు విశ్వశాంతి సనాతన సత్సంగంలు వ్యవస్థాపకులు, చలప సత్యనారాయణ గురూజీ (టెలిఫోన్ స్వామీజీ) ఆశీస్సులతో ప్రతి బుధవారం దాతల సహాయ సహకారాలతో ఘనంగా అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాతలు దుప్పలపూడి గ్రామానికి చెందిన దొండపాటి మణికంఠ సతీమణి పద్మ నాగ విజయ దుర్గ దంపతులు కుమారుడు వెంకట శివ సూర్య, కుమార్తె వరమహాలక్ష్మి బుధవారం వచ్చిన భక్తులకు అన్న వితరణ చేశారు.



మనసులోమాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

## జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన కార్యదర్శిగా కుమారి




**కాకినాడ (మనసులో మాట ) జూన్ 3**

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా కే.జే.ఎస్. ఎల్. కుమారి బాధ్యతను బుధవారం చేపట్టారు. అనంతరం వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను పర్యవేక్షించడానికి వచ్చిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ (సాయిబాబు రాజు) ను ఆమె మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భూపతి రాజు మాట్లాడుతూ ఉన్న అన్ని గ్రంథాలయాలను పాఠకుల అభివృద్ధికి తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు చేసి రాష్ట్రం లోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలని నూతన సెక్రటరీని ఆదేశించారు. అలాగే వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాల్లో వివిధ అంశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థిని విద్యార్థులను భూపతి రాజు అభినందించారు. అనంతరం నూతన సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన కుమారుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు గ్రంథాలయ నిర్వహకులు ఆమెకు పుష్పగుచుమిచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో కె. కిషోర్ ఎం. శ్రావ్య కే.రాజు టి. సాయి టీ.వీర్రాజు వెంకట్రావు ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు

## వడదెబ్బకు పంచాయతీ కార్మికుడు కోటేశ్వరరావు మృతి

**కాకినాడ (మనసులో మాట) జూన్ 3**



కొవ్వాడ రేపూరు గంగనాపల్లి పంచాయతీ కార్మికుల ఆందోళన మంగళవారం గడవక ముందే తిరిగి బుధవారం సర్పవరం గ్రామ పంచాయతీ కార్మికుడు బొండాడ కోటేశ్వరరావు (57 ) వడ దెబ్బ తో మృతి చెందడటంతో సర్పవరం గ్రామ పంచాయతీ కార్మికులు ఆందోళన బాటను చేపట్టారు. జిల్లా కలెక్టర్ పంచాయతీ అధికారులు కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని పి ఎఫ్ ఈఎస్ఐ లాంటి సంక్షేమ పథకాలను నిర్లక్ష్యం చేయకుండా అధికారులు అమలు చేయాలని ఎ పి గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ( సి ఐ టి యి) రూరల్ కార్యదర్శి చింతపల్లి అజయ్ కుమార్ సిఐటియు రూరల్ కార్యదర్శి తొట్టపూడి రాజాలు డిమాండ్ చేశారు.గత మూడు దశాబ్దాలకు పైగా పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న ఈ కార్మికులకు పి ఎఫ్ ఈ ఎస్ ఐ లాంటి సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని వారు ప్రశ్నించారు. ఈసంక్షేమ పథకాలు కార్మికులకు అమలు చేయకపోవడం వలన ఒక్క సర్పవరం గ్రామ పంచాయతీ లోనే 2025 26 సంవత్సరం లోనే బొండాడ కోటేశ్వరరావు గుర్రం అప్పన్న ముత్యాల నాగరాజు కట్ట ఆనంద బొండాడ సత్యనారాయణలు ఈ ఐదుగురు మరణించారు. అతి తక్కువ జీతాలతో పని చేసే వీరికి ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు కాకపోవడంతో ఆకుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబమే అనాధలవుతున్నది. దీనికి స్థానిక అధికారులు పూర్తిగా బాధ్యత వహించాలని ఈకుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని మరణించిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఎక్స్ గ్రేషియో చెల్లించాలని అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని పి ఎఫ్ ఈ ఎస్ ఐ పథకాలు మూడు నెలల బకాయి జీతాలు సంవత్సర కాలంగా ఇవ్వాల్సిన జీతాల ఎరియర్స్ లను వెంటనే ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు

# శంఖవరం తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసిన జేసీ

- **పాడుపడ్డ భవనం గా గుర్తించి అసహనం...**
- **రికార్డుల నిర్వహణ తీరుపై అసంతృప్తి...**
- **జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**

**అన్నవరం ( మనస్సు లో మాట) జూన్ 3**



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం అయిన శంఖవరం లో ఉన్న తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్
బుధవారం అకస్మికంగా తనిఖీ చేసారు. తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ కార్యాలయం ఆవరణ లో ఉన్న చెత్త చెదారం తో నిండి ఉన్న కార్యాలయ భవనాన్ని ఆయన గుర్తించి పాడుబడి నట్లుగా (ఎటువంటి రంగులు లేకుండా) ఉండడాన్ని గమనించారు.దీనితో అసహనం తో అసంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఉద్యోగుల హాజరు పట్టీని పరిశీలించి పేర్లు చదవగా అతి తక్కువ సంఖ్యలో మాత్రమే సిబ్బంది హాజరు కావడంతో తహశీల్దార్ తాతారావు పై ఆగ్రహం వ్యక్తం చేసారు. రికార్డుల గదిని పరిశీలించిన అపూర్వ భరత్ వాటిపై దుమ్ము, ధూళితో రికార్డులు మురికి పట్టడంపైన ఆగ్రహం వ్యక్తం చేసారు. అలాగే పిజిఆర్ఎస్ రిజిష్టర్ ను, మండల ప్రొఫైల్ ను అడుగగా తహశీల్దార్ తాతారావు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో జెసి భరత్ అసహనం వ్యక్తం చేసారు. శంఖవరం మండలం లోని 32 రెవెన్యూ గ్రామాలలో వేసవి దృష్ట్యా నెలకొన్న తాగునీటి సమస్యలపై ఆరా తీసారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన జనగణన సర్వేపై తహశీల్దార్ తాతారావు ను వివరాలు అడిగి తెలుసుకుని అన్ని గ్రామాల్లోనూ జనగణన సర్వే దాదాపుగా పూర్తి కాగా శంఖవరంలో మాత్రం 850
గృహాల సర్వే మిగిలిపోవడాన్ని గుర్తించి ఎంపిడిఓ నాగేంద్రను చరవాణిలో సర్వే పూర్తిస్థాయిలో గడువు లోపున వేగంగా నిర్వహించాలన్నారు. అనంతరం కార్యాలయం నుండి బయటకు వచ్చిన జెసి భరత్ తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి అంచనాలు రూపొందించి తనకు పంపించాలని తక్షణ చర్యల్లో భాగంగా వారం రోజుల్లో కార్యాలయానికి రంగులు వేయించాలని తహశీల్దార్ తాతారావును ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జెసి వెంట సిసీలు రఘు వీరబాబు పాల్గొన్నారు

# తిమ్మరాజుపేట గ్రామంలో పల్లెనిద్ర

- **ఎస్సై టి రామకృష్ణ**

**కోటనందూరు (మనసులో మాట) జూన్ 3**




కోటనందూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో తిమ్మరాజుపేట గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు శాఖ ప్రజలతో మమేకమై గ్రామాల్లో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో చేపడుతున్న పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా, కాకినాడ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోటనందూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ టి.రామకృష్ణ మరియు పోలీసు సిబ్బంది ఈ రోజు తిమ్మరాజుపేట గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశం నిర్వహించి మహిళలు, పిల్లల భద్రత, సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, గృహ హింస, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి మరియు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

అలాగే గ్రామంలో ఉన్న సమస్యలు, వీధి దీపాల సమస్యలు, మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వ్యక్తులు, జూదం, అనుమానాస్పద వ్యక్తుల సంచారం, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం సేకరించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళా ప్రతినిధులతో కలిసి శాంతి కమిటీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ అనుమతులు లేకుండా విగ్రహాల ఏర్పాటు చేయరాదని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బర్ల నరసింహమూర్తి, బర్ల వెంకినాయుడు, పంపనబోయిన కళ్యాణం తదితర గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# పారిశుధ్య కార్మికులకు జీతాల బకాయిలు చెల్లించాలి





**పెదపూడి (మనసులో మాట) జూన్ 3;**

పెదపూడి మండలంతో సహా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పారిశుద్ధ్య కార్మికులకు జీతాల బకాయిలను తక్షణమే చెల్లించాలని పారిశుధ్య కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఆర్. రఘువులు డిమాండ్ చేశారు. పెదపూడి లో బుధవారం నిర్వహించిన పారిశుధ్య కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం నిరంతరం సేవలు అందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల పట్ల అధికారులు పాలకులు నిరంకుశ వైఖరిని అవలంబించడం దారుణం అన్నారు. ఔట్సోర్సింగ్ కార్మికులకు కనీస ఉద్యోగ భద్రత కూడా లభించడం లేదని రఘువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య కార్మికుల జీతాల బకాయిలను తక్షణమే చెల్లించాలని లేకుంటే జిల్లా వ్యాప్త ఉద్యమాన్ని నిర్వహిస్తామని ఐఎఫ్టియు జిల్లా నేత గుబ్బల ఆదినారాయణ కోరారు. పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐ పిఎఫ్ వంటి సౌకర్యాలను కూడా కల్పించాలని, కార్మిక సమస్యలపై ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించాలని కార్మిక నేత మేడపాటి గోపాలకృష్ణ కోరారు.కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ సహాయ కార్మిక శాఖ అధికారి కార్తీక్ కోరారు. ఈ సమావేశంలో పత్తిపాటి వెంకట్రావు, తాతారావు, బచ్చ అనిల్, కసింకోట కుమార్, బంగారు ఆదినారాయణ, తుమ్మల ఆనందరావు,కసింకోట రాము తదితరులు పాల్గొన్నారు

మనసులోమాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

## జిల్లాలో భూగర్భ జలాల రీఛార్జ్ షాఫ్ట్ లు ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించాలి

- కాల్వలు, చెరువుల పూడికతీత పనులు నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలి



**ఏలూరు, జూన్, 3(మనసులో మాట)**

జిల్లాలో జలధార జలహారతి కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల రీఛార్జ్ షాఫ్ట్ లు ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాలను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.. కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశమందిరంలో బుధవారం జలధార జలహారతిలో పనుల ప్రగతిపై జిల్లా కలెక్టరు సమీక్ష అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలాల మట్టాలు పెంచేందుకు జలధారజలహారతి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో జిల్లాలో భూగర్భ జలాల రీఛార్జ్ షాఫ్ట్ లు ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి, వాటి ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. జిల్లాలో జలధార జలహారతి కాల్వలు, చెరువులలో పూడికతీత పనులను సక్రమంగా చేపట్టి నీటినిల్వ సామర్థ్యం గతం కన్నా పెరిగేలా పనులు పూర్తి చేసినప్పుడే జలధార కార్యక్రమం ఉద్దేశ్యం నెరవేరుతుందని, అధికారులు ఆ దిశగా పనిచేయాలన్నారు. ఈనెల రెండవ వారం నుండి వర్షాలు ప్రారంభం కానున్న దృష్ట్యా, కురిసిన ప్రతీ నీటి బొట్టును పరిరక్షించుకునేందుకు పనులు త్వరితగతిన పూర్తి చెయ్యాలని అన్నారు. పనులు ప్రారంభించక ముందు, పనులు పురోగతిలో ఉన్నప్పుడు, పూర్తి ఐన తరవాత ఫోటోలు తీసి ఆన్లైన్ లో అప్లోడ్ చెయ్యాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. మంజూరైన పనులలో ఇంకా ప్రారంభించని పనులను వెంటనే ప్రారంభించాలన్నారు.

## డీఎస్సీపై వైసీపీ విమర్శలు అనుచితం: సాయిబాబు

**తణుకు (మనసులో మాట), జూన్ 3:**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించడం నిరుద్యోగులకు వరంగా మారిందని మాజీ జెడ్పీటీసీ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా సాయిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు జరిగాయని వైఎస్సార్సీపీ నాయకులు ఆరోపించడం సమంజసం కాదన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు.

ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ఒక్కసారి కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన డీఎస్సీ నియామకాల్లో అవినీతికి తావులేదని పేర్కొన్నారు.

తెలుగుదేశం పార్టీ పాలనలో లక్షా 96 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారని, గత ఐదేళ్లలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఉద్యోగ నియామకాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు.

ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కాసగాని రామకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు కారెం బాబూరావు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కాకర చిట్టిరాజు, మరపట్ల వీర్రాజు, తామరపల్లి రాజేష్, మాంద్రు వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రూ. 52 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేస్తాం

- నగరాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడమే మా లక్ష్యం
- 10వ డివిజన్ అభివృద్ధికి రూ.11 కోట్లు ఖర్చు చేశాం
- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
- రూ.73 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

నగర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో నిర్లక్ష్యానికి గురైన 10వ డివిజన్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే రూ.11 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తెలిపారు. నగరంలోని 10వ డివిజన్ పరిధిలోని ఏపీఎస్ఈబీ ఫంక్షన్ హాల్ నుంచి వీఎల్ పురం జంక్షన్ వరకు రూ.73 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, తెలుగుదేశం పార్టీకి సంప్రదాయంగా మద్దతు ఇచ్చే ప్రాంతమనే కారణంతో గత పాలకులు అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం 10వ డివిజన్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేశామని చెప్పారు. ఇప్పటికే సుమారు రూ.4 కోట్ల విలువైన 25 అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ.2 కోట్ల పనులు ప్రారంభ దశలో ఉండగా, రూ.4 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. అదనంగా రూ.1 కోటి విలువైన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ రోజు ప్రారంభించిన సీసీ రోడ్డు నగరంలో అత్యంత రద్దీగా ఉండే, ప్రజలకు కీలకమైన కనెక్టివిటీ కల్పించే రహదారి అని అన్నారు. గతంలో నిధుల కొరత కారణంగా రోడ్డు పనులు కొంతవరకే పూర్తయ్యాయని, ఇప్పుడు మిగిలిన భాగాన్ని కూడా పూర్తి స్థాయిలో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏ పని ప్రారంభించినా పూర్తి చేసి చూపిస్తుందే తప్ప మధ్యలో వదిలిపెట్టదని స్పష్టం చేశారు.

**52 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్..**

ఈ ప్రాంతంలో ఉన్న లారీ స్టాండు స్థలాన్ని క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగిస్తూ మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. కేంద్ర ప్రభుత్వం "ఖేలో ఇండియా" పథకం కింద రెండో దశ పనులకు రూ.13 కోట్ల నిధులు మంజూరు చేసి, కాంట్రాక్టరుకు అవసరమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. మరో పది రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అదే విధంగా తొలి దశలో రూ.28 కోట్ల పనులు టెండరు దశలో ఉన్నాయని, రెండు నెలల్లో వాటి ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మూడో దశకు కూడా రూ.11 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ఎంపీ పురంధేశ్వరి కృషి చేస్తున్నారని వెల్లడించారు. మొత్తం మూడు దశల్లో రూ.52 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించి యువతకు అంకితం చేస్తామన్నారు.

**క్రీడా రంగానికి మరింత ప్రోత్సాహం..**

రాజమహేంద్రవరాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఇటీవల జిల్లా అధికారులతో సమావేశమై యువ క్రీడాకారుల కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదించారని చెప్పారు. అర ఎకరం స్థలం కేటాయిస్తే తమ సొంత నిధులతో నెట్ ప్రాక్టీస్ బాక్సులు, శిక్షకులను ఏర్పాటు చేస్తామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ముందుకు వచ్చిందన్నారు. పురుషులతో పాటు మహిళా క్రికెటర్ల కోసం ప్రత్యేక మహిళా కోచ్‌ను కూడా నియమించే ప్రతిపాదన ఉందని తెలిపారు. దీంతో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. కార్పొరేషన్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరిన వెంటనే ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

**అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం లక్ష్యం..**

నగరానికి భవిష్యత్తులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియాన్ని కూడా తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా యంత్రాంగం కలిసి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. తగిన స్థలం గుర్తించిన వెంటనే ఈ ప్రతిపాదనను కార్యరూపం దాల్చేలా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ, నగరాన్ని అభివృద్ధి, క్రీడా రంగాల్లో ఆదర్శంగా నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు పరిమితి పూర్తయింది అనడంతో రైతులకు షాక్

- రూ.100 కు పైగా తక్కువకు దళారులు ధాన్యం కొనుగోలు

**అనపర్తి (మనసులో మాట), జూన్ 3:**



రైతన్నే రాజు దేశానికి రైతే వెన్నెముక ఇవి చెప్పడానికి వినడానికి చాలా అందంగా గొప్పగా ఉంటుంది. కానీ రైతన్న పడే కష్టాలు అన్నీ ఇన్ని కావు. ప్రభుత్వం మాత్రం గొప్పలు చెప్పడమే తప్ప ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతన్నకు మాత్రం కష్టాలు తప్పడం లేదు. ఎన్నో కష్టనష్టాలు ఓర్చి, వరి ధాన్యం పండించిన రైతన్నకు ధాన్యం అమ్మేందుకు కూడా కష్టపడాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు 20 రోజుల క్రితమే పండించిన పంట రైస్ మిల్లులకు తోలినప్పటికీ ఇన్ని రోజుల అనంతరం జిల్లాకు సంబంధించి ధాన్యం కొనుగోలు లిమిట్ అయిపోయిందని, మళ్ళీ ఆదేశాలు వస్తే గానీ కొనలేమని మిల్లర్లు చెబుతున్నారని ఇంత కష్టపడి పండించిన పంట కొనుగోలు చేయకపోతే మా పరిస్థితి ఏమిటి అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడూ లేనివిధంగా రైతన్నలు పండించిన ధాన్యం కొనుగోలు చేయని పరిస్థితి ఏర్పడడం పట్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇంకా వందల కొద్ది టన్నులు వరి మిల్లర్లు వద్దే ఉండిపోవడం వల్ల మళ్లీ తొలకరికి పెట్టుబడులు ఏ విధంగా పెట్టుకోవాలని రైతులు మండిపడుతున్నారు. ఇప్పటికే వ్యవసాయంపై రైతులకు ఆసక్తి తగ్గుతున్న తరుణంలో ధాన్యం అమ్ముకునే పరిస్థితి కూడా లేకపోతే, రేపు అనే రోజు పంట పండించే రైతన్నే కరువు కావడం ఖాయమని పలువురు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రైతన్నకు ఏదో మేలు జరిగిపోతుందని ఆలోచించే కంటే క్షేత్రస్థాయిలో రైతన్నకు జరిగే నష్టాన్ని పట్టించుకుని ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే రాయలసీమ ప్రాంతంలో టమాట పంట గిట్టుబాటు ధర లేక రోడ్డుపై పడేసిన సంఘటనలే ధాన్యానికి కూడా ఎప్పుడు లేని విధంగా ఎదురయ్యే పరిస్థితి నెలకొందని రైతులు తీవ్ర మనస్థాపం చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి చర్యలు చేపట్టాలని దిగాలు పడ్డ రైతన్నలు విన్నవించుకుంటున్నారు. సిఎంఆర్ కి పరిమితి ముగిసిందని రూ.1600 కు (75 కేజీలు) కొనడం జరుగుతుందని ధాన్యం కొనుగోలు చేసే మధ్య దళారులు రైతుల వద్ద నుండి అప్పనంగా దోచేయడం తో రైతులు నిండా మునిగిపోతున్న సంఘటనలు కోకొల్లలు. మధ్య దళారులు, రైస్ మిల్లర్లు ఏకమై రైతుల వద్ద ధాన్యం కొనుగోలులో కోత విధిస్తున్నారని అమాయకపు రైతులను మోసం చేయడం తగదని కొద్దో గొప్పో చదువుకున్న రైతులు తెలపడం విశేషం.

మనసులోమాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా ఐఖ్యజం.. సంచలన తెలుగు దిన పత్రిక

# జాతీయ రహదారుల భూసేకరణ, నిర్మాణ పనులపై జేసీ సమీక్ష



**ఏలూరు, జూన్,3(మనసులో మాట)**

జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణానికి భూములు అందించిన రైతులకు పరిహారాన్ని వెంటనే అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జాతీయ రహదారి భూసేకరణ, నిర్మాణ పనుల ప్రగతిపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ జాతీయ రహదారి N.H.365BB జీలుగుమిల్లి నుండి పట్టిసీమ రహదారి పనులకు సంబంధించి రైతులకి చెల్లించవలసిన నష్ట పరిహారము మొత్తము విడుదల చేయవలసిందిగా జాతీయ రహదారి సంస్థ అధికారులను ఆదేశించారు. మరియు నష్ట పరిహారము పొందిన వారి నుండి భూమిని స్వాధీనము చేసుకొని రోడ్డు కాంట్రాక్టర్ వారికి అప్పగించవలసిందిగా సంబంధిత తహశిల్దార్ ను జేసీ ఆదేశించారు రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేసి, నిర్దేశించిన సమయం లోగా పూర్తి చేయాలన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పై వైఎస్ఆర్సిపి బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన

**రంపచోడవరం (మనసు-లోమాట) జూన్ 3.**



పోలవరం జిల్లా వి.ఆర్.పురం మండలంలోనీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు ఇంటి వద్ద చింతూరు, ఎటపాక, కూనవరం, విఆర్ పురం, మండకాలకు సంబందించిన ముఖ్య నాయకులు, బి ఎల్ ఏల కు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లకు, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పై అవగాహనా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు నాగులపల్లి ధనలక్ష్మి , ఎస్ ఐ ఆర్ టాస్క్ ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ వాముశెట్టి పరమేశ్వరావు ముఖ్య అతిధులుగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ బి ఎల్ ఏ లకు ఓటర్ లిస్ట్ పై, ఫామ్ 6,7,8, వాటర్ సవరణ ఎన్యూమరేషన్ లపై అవగాహన కల్పించారు. దొంగ ఓట్లు తీసివేసే కార్యక్రమం లో బి ఎల్ ఏ లు ఎక్టివ్ గా ఉండాలని, రెండు మూడు చోట్ల ఓటర్ ని కనిపెట్టాలని వారన్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి అయినా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటం లొ ప్రస్తుత ప్రభుత్వం విఫలమయిందని, ప్రభుత్వం వ్యతిరేక విధానాలను ఎండకట్టాలని రానున్న స్థానిక ఎన్నికలలో వైస్సార్సీపీ బలపరచిన అభ్యర్థులు అందరు గెలిచేలా నాయకులు కార్యకర్తలు కృషి చెయ్యాలని వారన్నారు. ఈ కార్యక్రమం లొ నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, చింతూరు జడ్పీటీసీ కూనవరం ఎంపీపీ జిల్లా కమిటి సభ్యులు మాజీ సర్పంచ్, ఎంపీటీసీ వివిధ హోదాలో వున్నా నాయకులు అనుబంధ సంఘాల అధ్యక్షులు నాలుగు మండలాల ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం కేర్ పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తి అండ

- **కలెక్టరేట్‌లో 'పీఎం కేర్స్ ఫర్ చిల్డ్రన్ లబ్ధిదారులతో**
- **జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**కాకినాడ (మనసులో మాట) జూన్ 3**




జిల్లాలో అర్హులైన 24 మంది పిల్లలకు రూ.10 లక్షల రూపాయలు చొప్పున పీఎం, సీఎం కేర్స్ ఆర్థిక భరోసా రూ.5 లక్షలరూపాయలు ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం బుధవారం అందచేశారు. కోవిడ్ 19 మహమ్మారి వల్ల తల్లిదండ్రులు ఇద్దరిని కోల్పోయిన పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం తో పాటు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా అండగా నిలుస్తుందని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ భరోసా ఇచ్చారు.

కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకం జిల్లా బాలల సంరక్షణ విభాగం ద్వారా నిర్వహించిన పీఎం కేర్స్ లబ్ధిదారుల ముఖాముఖి సమావేశం లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్.లక్ష్మితో కలిసి లబ్ధిదారులైన చిన్నారులతో జిల్లా కలెక్టర్ కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిన్నారులతో వారి చదువు ఆరోగ్యం ప్రస్తుతం ఉంటున్న సంరక్షకుల వివరాలు ఇతర యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ పీఎం కేర్ కింద లబ్ధి పొందుతున్న పిల్లలు చిన్ననాటి నుంచే మంచి క్రమశిక్షణ అలవర్చుకుని చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ రకాల ఆర్థిక విద్యా ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించు కోవాలన్నారు. తద్వారా తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దు కోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పీఎం కేర్ పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని ఏవిధమైన ఇబ్బంది కలిగిన వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కాకినాడ జిల్లాలో మొత్తం 24 మంది పిల్లలు లబ్ధిపొందు తున్నారని వీరి సంరక్షణను జిల్లా బాలల సంరక్షణ విభాగం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. జిల్లాలో 24 మంది లబ్ధిదారులందరికీ పీఎం కేర్స్ కింద రూ.10 లక్షల రూపాయలు సీఎం కేర్స్ కింద రూ.10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయంతో పాటు రూ.5 లక్షల విలువ గల ఆయుష్మాన్ భారత్ ఉచిత ఆరోగ్య బీమా కార్డుల సదుపాయం అందుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఐసీడీఎస్ పీడీ సీహెచ్.లక్ష్మి మాట్లాడుతూ ఈ పీఎం కేర్స్ పథకం ద్వారా పిల్లలకు 18 ఏళ్ల నుండి నెలవారీ స్టైఫండ్, 23 ఏళ్లకు రూ.10 లక్షల రూపాయలు కార్పస్ ఫండ్ తో పాటు ఉచిత కేంద్రీయ విద్యాలయాల ప్రవేశాలు ఉన్నత విద్యా రుణాలు వైద్య సహాయం అందుతాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు జిల్లా లీడ్ బ్యాంకు అధికారి సీహెచ్.ఎస్వీ.ప్రసాద్ తో కలిసి పీఎం కేర్స్ లబ్ధిదారులకు ఆర్థిక అక్షరాస్యత ఇతర అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి సీహెచ్. వెంకట రావు సీడీపీవో పి.వెంకట లక్ష్మి వై.లక్ష్మి పీఓఎన్ఐసీ జె.విజయ్ కౌన్సిలర్ బి.దుర్గా సోషల్ వర్కర్ ఎస్. చిన్న బాబు కె. రాంబాబు. ఇతర ఐసీడీఎస్ సిబ్బంది లబ్ధిదారుల సంరక్షులకు తదితరులు పాల్గొన్నారు

# జగ్గంపేటలో వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్ ఆవిష్కరించిన తోట నరసింహం

- **పార్టీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేసిన తోట నరసింహం**

**జగ్గంపేట (మనసులో మాట) జూన్ 3:**




జగ్గంపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యుడు తోట నరసింహం ఆవిష్కరించారు.పార్టీ శ్రేణులతో కలిసి కార్యక్రమ నిర్వహణపై ఆయన సూచనలు అందించారు.ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కార్యక్రమాన్ని గ్రామస్థాయి వరకు విస్తరించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.జూన్ 4 నుంచి 12 వరకు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.జూన్ 4న మండల కేంద్రాల్లో టీడీపీ మేనిఫెస్టో ప్రతులు, హామీ బాండ్లు, అబద్ధపు ప్రకటనల కాపీలను దహనం చేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. జూన్ 8న కూటమి ప్రభుత్వ వైఫల్యాల పై "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో ప్రత్యేక టౌన్ హాల్ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు నిరసనగా జూన్ 12న నియోజకవర్గ వ్యాప్తంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తోట నరసింహం తెలిపారు.ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ,రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురామ్,నాయకులు రావుల గణేష్ రాజా,మలిరెడ్డి పాపారావు,ఓలేటి రాజేశ్వరరావు,ఉయ్యూరి నాని,గుర్రం అబ్బు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్‌పై విమర్శలు రాజకీయ దివాళాకోరుతనమే

- **పెంకే జగదీష్**

**పిఠాపురం, (మనసులో మాట) జూన్ 3:**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌పై తెలంగాణ కాంగ్రెస్ నేతలు పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్, మందుల శామ్యూల్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహా బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ చేస్తున్న విమర్శలు వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యక్తిగత దూషణలకు దిగడం, అసత్య ప్రచారాలు చేయడం వెనుక రాజకీయ స్వార్థం తప్ప మరే ఉద్దేశం లేదని మండిపడ్డారు. ప్రస్తుతం ఏపీలో కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా పవన్ కళ్యాణ్ తన శాఖల ద్వారా ప్రజాదరణ పొందుతుండటాన్ని ఓర్వలేకే ఇరు పార్టీల నేతలు ఇలా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ప్రజల మద్దతుతో ఎదిగిన నాయకుడిని బలహీనపరచడం ఎవరితరం కాదని, అసత్య



వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని పెంకే జగదీష్ డిమాండ్ చేశారు.

మనసులో మాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

# ప్రజాగ్రహంతో మోదీకి గుణపాఠం తప్పదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు
- పెట్రోల్, డీజిల్ ధరల పెంపు పై రాజమండ్రి మెయిన్ రోడ్ లో వామపక్షాలు ప్రదర్శన
- షాప్ టు షాప్ కరపత్రాలు పంపిణీ






**రాజమహేంద్రవరం (మనసులో మాట ప్రత్యేక ప్రతినిధి), జూన్ 3:**

విద్యార్థులు, యువజనులు, అన్ని వర్గాల ప్రజలూ మోదీ పాలనలో విసిగిపోయారని.. వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురికాకతప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం స్థానిక కోట గుమ్మం సెంటర్ నుండి మసీదు వరకు ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముందుగా తాటిపాక మధు మాట్లాడుతూ సీపీఐ (ఎం) పోలిట్ బ్యూరో సభ్యుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంలో ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రాజకీయ ప్రేరేపితంగా జరిపిన దాడిని వామపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. మితవాద శక్తుల రాజకీయ కక్ష సాధింపును ఎదుర్కొంటున్న పినరయి విజయన్, సీపీఐ (ఎం), కేరళలోని కార్మిక, రైతాంగ ప్రజలకు సంఘీభావం తెలిపిందన్నారు. పినరాయి విజయన్ కేరళలోని కార్మికులు, రైతులు, అణగారిన వర్గాల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న ప్రజానాయకుడని ఆ ప్రకటన పేర్కొందన్నారు. కేరళలో అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వాలు ప్రజా ప్రత్యామ్నాయం సాధ్యమేనని ప్రపంచానికి నిరూపించాయని, మితవాద శక్తులు ఈ ప్రజా ప్రత్యామ్నాయాన్ని అసహనంతో చూస్తున్నాయన్నారు. కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించి చేస్తున్న ఈ వేట దానికి ప్రతిబింబమే అని ఆరోపించారు. కేంద్ర సంస్థలను ఉపయోగించి చేసే ఇటువంటి వేధింపుల ద్వారా వామపక్షల గొంతు నొక్క లేరన్నారు. పెట్రోల్, గ్యాస్ భారం కేంద్ర నిరంకుశ విధానాలపై ఈ నెల 9న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహిస్తామని అన్నారు.

ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలను ఇప్పటికి నాలుగుసార్లు పెంచడాన్ని తీవ్రంగా ఖండించినట్లు తెలిపారు. మరలా ధరలను పెంచుతున్నట్లు వచ్చిన వార్తల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా జూన్ 1 నుండి ఏడవ తేదీ వరకూ రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం కరపత్రాల పంపిణీ, సమావేశాలు, సదస్సుల రూపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీ పవన్ మాట్లాడుతూ కేజీ బేసిన్ గ్యాస్ సాధన కోసం పాశర్లపూడి ప్రాంతంలో వామపక్షాలు జూన్ మొదటి వారంలో పర్యటిస్తాయని వివరించారు. కేంద్రం పెట్రోలు ధరలను రోజువారీ లెక్కన పెంచుతోందని, దీని వల్ల రోజు వారీ ఉపాధిపై ప్రభావం పడుతోందని, రోజు వారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పెట్రోలు ధరల్లో 54 రూపాయలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులే ఉన్నాయని, ధరలు పెరిగిన సమయంలో పన్నులు తగ్గించుకుని ప్రజలపై భారాలు పడకుండా చూడాల్సిన ప్రభుత్వం ఆ పని చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదని అన్నారు. పెరిగిన ధరలను ప్రజలపైనే రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కే రాంబాబు మాట్లాడుతూ ప్రజలపై పడుతున్న భారాలను తగ్గించేందుకు పెట్రోలు, డీజిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు తగ్గించాలని కోరారు. కేజీ బేసిన్ నుండి ఉత్పత్తి అయ్యే చమురు, గ్యాస్‌లో 50 శాతం రాష్ట్రానికి కేటాయించాలని కోరారు. రష్యా, ఇరాన్ నుండి అయిల్ కొనుగోలు కొనసాగించాలని, కమర్షియల్ గ్యాస్‌ను పాత ధరలకే ఇవ్వాలని డిమాండు చేశారు. ముఖ్యంగా కేజీ బేసిన్ గ్యాస్‌పై 50 శాతం ప్రభుత్వానికి హక్కు కల్పించాలని కోరారు. కొత్తగా కాజ దగ్గర బయటపడ్డ గ్యాస్, అయిల్‌ను వేదాంతకు ఇచ్చారని, దీన్ని ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఎస్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలపై భారం వేసేలా అమెరికా నుండి అయిల్ కొనుగోలు చేయడం వెనుక అదానీ కుంభకోణం, కేసుల మాఫీ వ్యవహారం ఉందని అన్నారు. విజయన్‌పై దాడి కుట్రే కేరళం మాజీ సీఎం పినరయి విజయన్‌పై దాడి వెనుక కేంద్రం కుట్ర ఉందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలను జేబు సంస్థలుగా మార్చి ప్రతిపక్ష నేతలపై దాడులకు ఉసిగొల్పుతున్నారని, ప్రజలు దీన్ని చూస్తూ ఊరుకోరని తెలిపారు. ఈ కార్యక్రమలో సీపీఐ నగర కార్యదర్శి వీ కొండలరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లం వెంకటేశ్వరావు, పీ లావణ్య, నల్ల రామారావు, టీ నాగేశ్వరావు, కాకి శారద, దేముడు బాబు, సీపీఎం నాయకులు ఎస్ఎస్ మూర్తి, జువ్వల రాంబాబు, పూర్ణిమ రాజు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఎన్ సతీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# అంచనాలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణం జరగాలి

- వాహనాల రద్దీకి అనుగుణంగా బ్రిడ్జి రూపురేఖలు మార్చాలి






**గోకవరం (మనసులో మాట), జూన్ 3 :**

అంచనాలకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణం జరగాలని, వాహనాల రద్దీకి అనుగుణంగా బ్రిడ్జి రూపురేఖలు మార్చాలని దళిత నాయకుడు వర్షాల ప్రసాద్ అన్నారు. ఏజెన్సీ ముఖద్వారం మండల కేంద్రం గోకవరంలో బ్రిటిష్‌కాలం నాటి ఎస్ ఆకారం వంతెన శిధిల వ్యవస్థకు చేరుకోవడంతో కొత్తగా నిర్మిస్తున్నటువంటి బ్రిడ్జి తిన్నగా కాకుండా వంకరగా ఎస్ కారంలో నిర్మించడం వల్ల ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని దళిత నాయకుడు వరసాల ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లడంతో పాటు ఎన్నో సంవత్సరాల నుండి లూథరన్ చర్చిల్లో ప్రార్థనలు జరుగుతున్నాయని ఇప్పుడు ఆ చర్చి ప్రదేశం కూడా వంకర బ్రిడ్జి నిర్మాణంతో కోల్పోవాల్సి వస్తుందని తక్షణం అధికారులు స్పందించి బ్రిడ్జిని వంకర లేకుండా తిన్నగా నిర్మించాలని లేనిపక్షంలో న్యాయ పోరాటానికైనా సిద్ధం అని వరసాల ప్రసాద ్అన్నారు. బుధవారం చర్చి ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దళిత నాయకుడు వరసాల ప్రసాదు మాట్లాడుతూ లూథరన్ చర్చి ఎదురుగా కడుతున్న బ్రిడ్జి హైవేపై తిన్నగా కాకుండా వంకరగా త్రిప్పి కట్టడం వలన ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలకు ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాట్లు చేసిన సమయంలో అధికారులు ప్రజాప్రతినిధులు కలిసి బ్రిడ్జి నిర్మాణం వల్ల చర్చి గోడ అంచు పోతుందని చెప్పారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అదే బ్రిడ్జి నిర్మాణం చేస్తూ అధికారులు ప్రజా ప్రతినిధులు వచ్చి చర్చి మెట్లు వరకు తీసేస్తామని చెప్పడం అన్యాయం అన్నారు. బ్రిటిష్ కాలంలో ఎస్ ఆకారంలో వంతెన కట్టారు. అప్పుడు వాహనాలు చాలా తక్కువగా ఉండేవని ప్రస్తుత కాలంలో అంచనాలకు మించి వాహనాలు రోడ్డు మీద పరుగులు పెడుతున్నాయని అందుకు అనుగుణంగా బ్రిడ్జి నిర్మాణ పనులు జరగాలి తప్ప ఎస్ ఆకారంలో బ్రిడ్జి నిర్మాణం జరిగితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వరసాల ప్రసాద్ అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేసినప్పటికీ స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే చొరవ చూపితేనే ఈ సమస్యకు ఒక మోక్షం కలుగుతుందని ఆయన తెలిపారు

**నేషనల్ హైవే**

గోకవరంలో జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణం రోడ్డు నేషనల్ హైవేగా మారుతుందని ఇటు అధికారులు అటు ప్రజాప్రతిథులు చెప్తున్నారని నేషనల్ హైవే వంకర బ్రిడ్జి నిర్మాణాలు చేయడం సరికాదన్నారు. ఇదే రహదారిలో బాలాజీ పేట దగ్గర పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు చిన్న మలుపు రావడం వల్ల అనేక ప్రమాదాలు జరిగి ఎంతో మంది మృత్యువాత పడ్డారన్నారు. ప్రస్తుతం ఆ మలుపు తొలగించి తిన్నగా రోడ్డు వేయడం వల్ల ప్రమాదాలు లేకుండా వాహనదారులు గమ్యాలకు చేరుకుంటున్నారని వరసాల ప్రసాద్ అన్నారు. 100 సంవత్సరాలుగా ప్రార్థనలు జరుపుకుంటున్న చర్చి స్థలాలను కూల్చడం సరికాదన్నారు, ప్రజలకు ప్రాణ నష్టం కలుగకుండా ఉండడానికి, చర్చి స్థలం పోకుండా ఉండడానికి బ్రిడ్జి రూపురేఖలు మార్చి తిన్నగా వంతెన వెయ్యాలని దళిత నాయకుడు వరసాల ప్రసాద ్డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాన్ వెస్లీ, మందపాటి సతీష్ కుమార్, బొడ్డపాటి వీరచంద్రం, రాజరత్నం, పెరవలి విక్రమ్, వందవాసు జయరాజు, జక్కల విన్ను, మందపాటి వెంకటరత్నం, మందపాటి నారాయణ మూర్తి, సామంతులు రమేష్. గొర్త రాంబాబు, బొద్దని నాగరాజు, మందపాటి రాజు, కంద సత్తిబాబు, వజ్రంగి ధర్మరాజు, మోర్త దానియేలు, మందపాటి రత్నకుమారి, ఆకాశపు నాగమణి, ఉల్లి లక్ష్మి, మగపు అన్నపూర్ణ, హర్ష. అజయ్, రాము. శీను. జాన్ కిష్టాపూర్. కిషోర్. జిమ్మీ కట్టర్. మచ్చ వేణు. కామాకుల వినయ్. మంగ తదితరులు పాల్గొన్నారు